
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
బుధవారం
02 సెప్టెంబర్ 2026



## చదువుకోడానికి వచ్చి..
## చిత్తవుతున్న భవిష్యత్తు!



- పాఠశాలలు, కళాశాలలకు డుమ్మా..
- టీ దుకాణాల్లో సిగరెట్ల దమ్ము
- తల్లిదండ్రుల పర్యవేక్షణ కరువు.. విద్యాసంస్థల చుట్టూ నిఘా ఏదీ?

**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** చదువుతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన విద్యార్థులు కొందరు చెడు అలవాట్ల వైపు అడుగులు వేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుల కోసం పట్టణానికి వస్తున్న కొందరు విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు డుమ్మా కొట్టి టీ దుకాణాలు, ఇతర ప్రాంతాల్లో గంటల తరబడి గడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు విద్యార్థులు చిన్న వయసులోనే సిగరెట్లు, పొగాకు వంటి అలవాట్లకు బానిసవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**తరగతి గదుల్లో ఉండాల్సిన వారు.. బయటేనా?**

విద్యాసంస్థల్లో పాఠాలు వినాల్సిన సమయంలో విద్యార్థులు బయట తిరుగుతున్నా పట్టించుకునే వారు లేకపోవడం సమస్యకు ప్రధాన కారణంగా మారుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులు పాఠశాలకు, కళాశాలకు వెళ్లారా? మధ్యలో బయటకు వస్తున్నారా? ఎవరితో తిరుగుతున్నారు? అనే అంశాలపై తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు నిత్యం పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

**చిన్న వయసులోనే చెడు అలవాట్ల వలలో..**

స్నేహితుల ప్రభావం, సరదాగా మొదలయ్యే పొగతాగడం వంటి అలవాట్లు క్రమంగా వ్యసనాల వైపు నడిపించే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యం, ప్రవర్తన, భవిష్యత్తుపైనా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

**విద్యాసంస్థల పరిసరాల్లో నిఘా పెంచాలి...**

పెద్ద శంకరంపేట పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లోని టీ దుకాణాలు, ఇతర ప్రదేశాలపై సంబంధిత అధికారులు, పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. విద్యార్థులకు పొగాకు ఉత్పత్తులు విక్రయించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**తల్లిదండ్రులు మేల్కొనాల్సిన సమయం..**

విద్యార్థుల భవిష్యత్తును కాపాడటంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని పలువురు సూచిస్తున్నారు. పిల్లలు పాఠశాల, కళాశాలకు వెళ్తున్నారా? సమయానికి ఇంటికి వస్తున్నారా? ఎవరితో స్నేహం చేస్తున్నారు? అనే విషయాలపై తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలి. విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, పోలీసులు, సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపడితేనే విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు: ఎస్పీ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్ 1(జనంసాక్షి):** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు **“30 పోలీస్ ఆక్ట్”** అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ30 పోలీస్ ఆక్ట్ సెప్టెంబర్ 30వ తేది వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావే శాలు, ఊరేగింపులు, ధర్నాలు వంటి కార్యక్రమా లు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహా లు చేయరాదని తెలిపారు.అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారితీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశా లను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబ డతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధంలో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునీ అనుమతులు తీసుకోవాలని ఎస్పి కోరారు.

## భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో అభ్యంతరాలుంటే అప్పీల్ చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 1(జనంసాక్షి):** జిల్లాలో భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలపై అభ్యంతరాలు ఉంటే సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో అప్పీల్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. మంగళవారం మెదక్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. 9(2) చట్టం ప్రకారం అప్పీల్ చేసుకుంటే డీటీ స్థాయి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ అధికారుల ద్వారా సమస్యలను పరిష్కరించే అవకాశం ఉందన్నారు. రీసర్వే అప్పీళ్ల కోసం తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రమాదేవి, ఏడీ ల్యాండ్ సర్వే కిషన్, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అనుమతి లేని సభలు, ర్యాలీలపై కఠిన చర్యలు

### సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు: జిల్లా ఎస్పీ సునిత రెడ్డి




**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 1(జనంసాక్షి):** జిల్లాలో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడడం, అవాంఛనీయ ఘటనలను ముందస్తుగా నివారించే ఉద్దేశంతో సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి,తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా పరిధిలో ముందస్తు పోలీసు అనుమతి లేకుండా బహిరంగ సభలు, ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, ఊరేగింపులు, భారీ సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యక్రమాలను పోలీసులు ఉపేక్షించబోరని, 30 పోలీస్ యాక్ట్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా సంస్థ, సంఘం లేదా వ్యక్తి బహిరంగ కార్యక్రమం నిర్వహించాలనుకుంటే సంబంధిత పోలీసు అధికారులను ముందుగానే సంప్రదించి అనుమతి పొందాలని సూచించారు. ప్రజల భద్రత, ప్రశాంతత, సామాజిక శాంతిని పరిరక్షించడమే ఈ నిబంధనల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజలందరూ చట్టాలను గౌరవిస్తూ పోలీసుశాఖకు సహకరించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎస్పీ సునిత రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన సీఎం ప్రధాన కార్యదర్శి



**నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్ 1(జనంసాక్షి):** రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 4న నారాయణపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించేందుకు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శ్రీధర్ ఐఏఎస్ మంగళవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి తో కలిసి మద్దూరు పరిసర ప్రాంతాల్లో పర్యటించి వివిధ అభివృద్ధి పనులు, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా మద్దూరు సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం చింతల్‌దిన్నె మార్గంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల/కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాల/కళాశాల నిర్మాణ ప్రాంగణంలో భవన నిర్మాణానికి సంబంధించిన మ్యాప్, పనుల టైమ్‌లైన్‌తో కూడిన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి మార్చి నెలలోపు పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్ పరిశీలించారు. మద్దూరు సమీపంలోని డిగ్రీ కళాశాల భవనం వద్ద ఒక స్థలంతో పాటు చింతల్‌దిన్నె సమీపంలోని మరో స్థలాన్ని పరిశీలించి, హెలిప్యాడ్ ఏర్పాటుకు అవసరమైన భద్రతా, సాంకేతిక ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సీఎం ప్రధాన కార్యదర్శి శ్రీధర్ అధికారులను ఆదేశించారు.

## పోలీస్ క్యాంటీన్‌కు అడుగులు

- పోలీస్ అసోసియేషన్ విజ్ఞప్తిపై ఎస్పీ సానుకూల స్పందన




**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం దిశగా మెదక్ జిల్లాలో పోలీస్ క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఇటీవల ఎన్నికైన మెదక్ జిల్లా పోలీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావును కలిసి మెదక్ జిల్లాలో పోలీస్ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు విజ్ఞప్తి చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారి విజ్ఞప్తిపై ఎస్పీ సానుకూలంగా స్పందించారు.

క్యాంటీన్ ఏర్పాటు విషయమై ఉన్నతాధికారులతో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్యాంటీన్ ఏర్పాటు ప్రక్రియకు సంబంధించిన బాధ్యతలను సీఐ సందీప్‌రెడ్డి, ఆర్‌ఐ శైలేందర్‌కు అప్పగించారు. జిల్లా పోలీసు సిబ్బందికి అవసరమైన నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండేలా క్యాంటీన్ ఏర్పాటు చేయడం ద్వారా మరింత సౌకర్యం కలగనుందని పోలీస్ అసోసియేషన్ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# పోటీ పరీక్షల్లో విజయానికి పట్టుదలే ఆయుధం: కలెక్టర్ ప్రతీక్ జైన్

- **ఉచిత ఫౌండేషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి**

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 1(జనంసాక్షి):** పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తే అనుకున్న లక్ష్యాలను తప్పకుండా సాధించవచ్చని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్, ఇతర సదుపాయాలను సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్, పోలీస్ తదితర పోటీ పరీక్షలకు నిర్వహిస్తున్న ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో పోటీ పరీక్షలకు పెద్ద సంఖ్యలో అభ్యర్థులు హాజరవుతున్నారని, పోటీని చూసి నిరుత్సాహపడకుండా వందశాతం శ్రమ, ఏకాగ్రత, పట్టుదలతో లక్ష్యం దిశగా ముందుకు సాగాలని అన్నారు. ప్రతిరోజూ నిర్ణీత సమయాన్ని కేటాయించి ప్రణాళికాబద్ధంగా చదువుకోవడంతో పాటు పరీక్షలకు అవసరమైన నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలని సూచించారు.

"మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. పట్టుదల, ఆత్మవిశ్వాసంతో కృషి చేస్తే విజయం సాధించడం సాధ్యమే" అని కలెక్టర్ విద్యార్థులకు ఉద్బోధించారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లను చూసి వెనుకడుగు వేయకుండా వాటిని అవకాశాలుగా మలుచుకుని ముందుకు సాగాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

అనంతరం బీసీ స్టడీ సర్కిల్‌లోని తరగతి గదులు, స్టడీ మెటీరియల్, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. నాణ్యమైన శిక్షణ అందించడంతో పాటు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని, అధ్యయన వాతావరణాన్ని మరింత మెరుగుపరచాలని నిర్వాహకులకు సూచించారు.




ఈ ఐదు నెలల శిక్షణ ద్వారా వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు పరీక్ష విధానం, సిలబస్, ప్రాథమిక అంశాలు, సాధారణ అవగాహన తదితర అంశాల్లో అవసరమైన మార్గదర్శకత్వం లభిస్తుందని జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్ తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి జగదీష్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, శిక్షకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ హాస్టల్‌లో అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేసిన అదనపు కలెక్టర్



**రాజాపూర్, సెప్టెంబర్ 1(జనంసాక్షి):** సోమవారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ కేజీబీవీ హాస్టల్ ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్‌లో ఎక్కడా చూసినా అపరిశుభ్రంగా ఉండటంతో ఎస్ ఓ లక్ష్మీబాయి పై ఆగ్రహం వ్యక్తం చేశారు.సీజనల్ వ్యాధుల వచ్చే ప్రమాదం ఉందని , ఉపాధ్యాయులే ఇలా విద్యార్థులు ఉండే వసతి గృహాలు, పాఠశాల గదులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని తెలియదా అని అన్నారు.కలెక్టర్ వెంబడి ఎంపీడీవో విజయలక్ష్మి, సర్పంచ్ రామకృష్ణ, ఎంపీఓ పుష్ప, ఏపీవో భారతి, అసిస్టెంట్ ఇంజనీర్ కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో జాతీయ భావం పెంపొందాలి..



**మహమ్మదాబాద్,సెప్టెంబరు 01(జనంసాక్షి):** విద్యార్థుల్లో జాతీయ భావంతోపాటు భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వంపై అవగాహన పెంపొందించేందుకు క్విజ్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని, మండల విద్యాధికారి రాజు నాయక్ అన్నారు.మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో భారత జాతీయ కళలు,సంస్కృతి,వారసత్వంపై మండల స్థాయి క్విజ్ పోటీలను ఇంటాక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఈపోటీలో గెలుపొందిన,విద్యార్థులకు మనీ బహుమతులు, అందజేశారు. కార్యక్రమంలో (ఇంటాక్) మహబూబ్‌నగర్ చాప్టర్ నిర్వాహకులు, రామచందర్, రాజుచారి, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వేతన కోతలు ఆపాలి.. బకాయి జీతాలు చెల్లించాలి

**మెదక్ మున్సిపల్, ఆగస్టు 1 (జనంసాక్షి):** మెదక్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇతర విభాగాల మున్సిపల్ కార్మికుల వేతనాల్లో అనవసరంగా కోతలు విధించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ, మున్సిపల్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి కార్మికులు భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని వేతన కోతలు, పెండింగ్ జీతాలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా విధిస్తున్న వేతన కోతలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాల బకాయిలను తక్షణమే చెల్లించాలని, ప్రతి నెలా 1వ తేదీన పూర్తి వేతనాలు అందించాలని కోరారు.బయోమెట్రిక్ హాజరు తదితర కారణాలతో ఇప్పటికే విధించిన కోతలను వెనక్కి తీసుకోవాలని అన్నారు. పట్టణ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు నాణ్యమైన రక్షణ పరికరాలు, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. "కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదు" అని నాయకులు స్పష్టం చేశారు. వేతన కోతలు, బకాయి జీతాల సమస్యలను పరిష్కరించకపోతే పారిశుధ్య పనులను నిలిపివేసి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ అధికారులకు అందజేశారు. సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు






హామీ ఇవ్వడంతో కార్మికులు మహాధర్నాను తాత్కాలికంగా విరమించారు.

## ఈ నెల15 వరకు "చేయూత పెన్షన్ల" దరఖాస్తులకు ఆహ్వానం

- **ఎంపీడీఓ షాగుప్తా ఇర్ఫత్**



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 01 (జనంసాక్షి):** జిల్లా ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు తాజాగా "చేయూత పెన్షన్ల" కోసం ఈనెల15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని మండల అభివృద్ధి అధికారిణి షాగుప్తా ఇర్ఫత్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఆగస్టు10 నుండి ఆగస్టు 31 వరకు ఈ పాటికే దరఖాస్తు చేసుకున్నారని, ఇదివరకు దరఖాస్తు చేసుకొని అర్హులైన ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత, చేనేత కార్మికులు, డయాలిసిస్, ఫైలేరియా, తదితర రోగస్తులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయంలో సందేహాలను నివృత్తి చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

## నేడు ఎస్ఐఆర్ నోటీసులపై హియరింగ్

- **నోటీసులు అందుకున్న ఓటర్లు తప్పనిసరిగా హాజరు కావాలి**
- **సర్పంచ్ చింతగల శ్రీనివాసులు**



**ఉప్పునుంతల, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** ఉప్పునుంతల గ్రామ ప్రజలు, ఓటర్లకు గ్రామ సర్పంచ్ చింతగల శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఐఆర్ (SIR)లో భాగంగా బీఎల్ఓలు పంపిణీ చేసిన నోటీసులకు సంబంధించి నేడు ఉదయం 9 గంటలకు ఉప్పునుంతల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద హియరింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు హియరింగ్‌కు తప్పనిసరిగా హాజరై, తమ నోటీసులతో పాటు ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ మెమో, పాన్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీలను తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా ఓటరు తల్లి లేదా తండ్రికి సంబంధించిన భూమి పాసుపుస్తకం, పాన్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీలను కూడా వెంట తీసుకురావాలని కోరారు.

## మల్గిలో శ్రీశా ఫార్మాల్డి హైడ్ రసాయన పరిశ్రమ ఏర్పాటుకు బ్రేకులు

- **దరఖాస్తును తిరస్కరించిన కేంద్ర పర్యావరణ శాఖ**
- **యువత పోరాటంతో కెమికల్ ప్లాంట్ ప్రతిపాదనకు బిగ్ షాక్**

**న్యాల్‌కల్, సెప్టెంబర్ 01, (జనంసాక్షి):** పర్యావరణ పరిరక్షణకు పెను ప్రమాదకరంగా మారిన రసాయన పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనలకు బ్రేకులు పడ్డాయి. కెమికల్ ప్లాంట్ ప్రతిపాదన కోసం దరఖాస్తు చేసుకున్న నిర్వాహకులకు.. కేంద్ర పర్యావరణ శాఖ బిగ్ షాక్ ఇచ్చింది. పరిశ్రమ ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతిపాదనలో.. పర్యావరణ శాఖకు విరుద్ధంగా ఉన్నాయని, ఈ మేరకు ఇచ్చిన ప్రతిపాదనలను కేంద్ర పర్యావరణ శాఖ తాజాగా తిరస్కరించింది. గత వారం రోజులుగా స్థానిక యువత చేపట్టిన పోరాటం ఫలించింది.

**మల్గిలో శ్రీశా ఫార్మాల్డి హైడ్ రసాయన పరిశ్రమకు తిరస్కరణ...**

తెలంగాణ - కర్ణాటక సరిహద్దు, సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, మల్గి గ్రామ శివారులోని సర్వే నంబర్ 152/U/2 వ్యవసాయ భూమిలో శ్రీశా ఫార్మాల్డి హైడ్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు, సింథటిక్ ఆర్గానిక్ కెమికల్స్ తయారీ యూనిట్ కోసం కంపెనీ యాజమాన్యం.. ప్రతిపాదనలతో కేంద్ర పర్యావరణ శాఖకు అనుమతి కోసం ఇటీవల దరఖాస్తు చేసింది. దరఖాస్తులు స్వీకరించిన కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ పరిశీలించింది. అనంతరం పర్యావరణ శాఖ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నేపథ్యంలో దరఖాస్తు తిరస్కరించి వెనక్కి పంపించింది.

**యువత, రైతుల ఫిర్యాదులు, వినతుల నేపథ్యంలో...**

కేంద్ర పర్యావరణ శాఖకు విరుద్ధంతో పాటు స్థానిక రైతులు, యువత ఫిర్యాదులు, వినతుల నేపథ్యంలో కెమికల్ పరిశ్రమ ఏర్పాటు కోసం ఇచ్చిన దరఖాస్తును వెనక్కి పంపినట్లు కేంద్ర పర్యావరణ శాఖ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఆగస్టు 25న నిర్వహించిన కేంద్ర పర్యావరణ శాఖ నిపుణుల కమిటీ సమావేశంలో దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించినట్లు సమాచారం. పరిశ్రమలు ఏర్పాటుకు కావలసిన ప్రధాన





మైన 15 అంశాలు అస్పష్టతగా ఉన్న నేపథ్యంలో దరఖాస్తును వెనక్కి పంపినట్లు తెలిసింది.

**వారం రోజులుగా యువత పోరాటం...**

గ్రామానికి చెందిన పలువురు యువకులు కెమికల్ ప్లాంటు ఏర్పాటుకు వ్యతిరేకంగా గత వారం రోజులుగా వివిధ రూపాలలో ఆందోళన చేపట్టారు. పరిశ్రమ ఏర్పాటుతో గ్రామ ప్రజానీకానికి, పర్యావరణానికి, వ్యవసాయ రంగానికి, జల కాలుష్యం, అనారోగ్యాల బారిన పడి ప్రమాదం పొంచి ఉందని యువకులు ఇంటింటికి వెళ్లి సంతకాల సేకరణ చేపట్టారు. గ్రామపంచాయతీ కార్యదర్శి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారం రోజుల క్రితం సేకరించిన సంతకాల సేకరణను పర్యావరణ శాఖకు పోస్టు ద్వారా నివేదికను సమర్పించారు. ఎట్టకేలకు కేంద్ర పర్యావరణ శాఖ, నిపుణుల కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి కెమికల్ ప్లాంట్ ప్రతిపాదన ఏర్పాటుకు బ్రేకులు వేయడం పట్ల స్థానిక యువకులు, రైతులు సంతోషం వ్యక్తం చేశారు. తిరిగి కెమికల్ ప్లాంట్ ప్రతిపాదనకు అనుమతులు ఇచ్చి పరిశ్రమను ఏర్పాటు చేస్తే ఉద్యమాన్ని మరింతగా ఉదృతం చేస్తామని యువత, రైతులు స్పష్టం చేశారు.

## ఉప సర్పంచ్ పవిత్ర కుటుంబాన్ని
# ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పరామర్శ



**సదాశివపేట, సెప్టెంబర్ 1(జనంసాక్షి):** మండలంలోని వెల్టూర్ గ్రామ ఉపసర్పంచ్ నాయికోటి పవిత్ర అనారోగ్యం తో గుండెపోటుకు గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వెల్టూర్‌కు వెళ్లి పవిత్ర మృతదేహానికి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కార్యక్రమంలో సర్పంచ్ తొంట కిష్టయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడీల సుమిత్ర సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచులు గద్దమీద సత్యనారాయణ, పబ్బతి లక్ష్మారెడ్డి, యాదయ్య, మధు, పాపయ్య, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 420 హామీలపై బీఆర్ఎస్ పోరుబాట



**రేగోడు, సెప్టెంబర్ 01(జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరుబాట చేపడతామని బీఆర్ఎస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రేగోడు మండల కేంద్రంలో మంగళవారం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సుంకె రమేష్, మాజీ అధ్యక్షుడు వినోద్, మాజీ సర్పంచులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడి మృతి
# చాలా బాధాకరం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**రాజాపూర్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** బచ్చిరెడ్డి భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి. రాజాపూర్ మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బచ్చిరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. బచ్చిరెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శేఖర్ గౌడ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు
# పాటించాలి: మక్తల్ సీఐ రామ్ లాల్



**మక్తల్, సెప్టెంబర్ 01 (జనంసాక్షి):** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మక్తల్ సీఐ రామ్ లాల్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఎస్ఐ రాజుతో కలిసి పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... వాహనదారులు అతివేగం, ట్రిపుల్ రైడింగ్ మానుకోవాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని, రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

# కొత్త పెన్షన్ విధానం రద్దు చేయాలి... పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

- పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని ఉద్యోగులు నిరసన
- తెలంగాణ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిరసన
- నల్ల బ్యాడ్జీలతో సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట నిరసన
- ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్




**సంగారెడ్డి, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి, పెన్షన్ వ్యతిరేక దినాన్ని పురస్కరించుకొని టిజిఈజేఏసీ సంగారెడ్డి జిల్లా ఉద్యోగ సంఘాల నాయకులు మంగళవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జావిద్ అలీ మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం (సీపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని, అలాంటి హక్కును ఉద్యోగుల నుంచి దూరం చేయడం సరికాదన్నారు. ఉద్యోగుల భవిష్యత్తుకు భద్రత కల్పించే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

దేశంలోని పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఎన్నికల ప్రచారంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇవ్వడమే కాకుండా, ఎన్నికల ప్రణాళికలోనూ ఈ అంశాన్ని స్పష్టంగా పేర్కొందన్నారు.

అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ముప్పై నెలలు గడిచినా ఇప్పటివరకు కొత్త పెన్షన్ విధానం రద్దుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఉద్యోగ, న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించాలని కోరారు.

ఉద్యోగులకు రావలసిన 6 ఆర్డిఏలను పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైద్యనాథ్, రవి, డాక్టర్ సంతోష్ కుమార్, టిపిటిఎఫ్ అధ్యక్షులు, సోమశేఖర్, యుటిఎఫ్ కార్యదర్శి సాయిలు, నాలుగో తరగతి ఎంప్లాయిస్ అధ్యక్షులు షరీఫ్, యాదవ రెడ్డి, వివిధ సంఘాల మహిళ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# పొరుగు సేవల సిబ్బంది పేరుతో వేతనాలు తగ్గించవద్దు

**తూప్రాన్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** పొరుగు సేవల సిబ్బంది పేరుతో వేతనాలు తగ్గించవద్దని కోరుతూ తూప్రాన్ మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. గత 5 నుంచి 25 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో సేవలందిస్తున్న తమ వేతనాలను తగ్గిస్తే కుటుంబ పోషణ భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

తూప్రాన్ మున్సిపాలిటీలో బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితర హోదాల్లో పనిచేస్తున్న సిబ్బందికి గతంలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వేతనాలు చెల్లించారు. జి.ఓ.ఎం.ఎస్. నెం.14 (2016), జి.ఓ.ఎం.ఎస్. నెం.60, 63 (2021) ద్వారా వేతన సవరణలు, 30 శాతం పీఆర్‌సీ పెంపు, అనంతరం జి.ఓ.ఎం.ఎస్. నెం.40 (2023), మున్సిపల్ శాఖ మెమో ద్వారా మరో రూ.1,000 పెంపు అమలయ్యాయని తెలిపారు.

ప్రస్తుతం నిత్యావసరాలు, ఇళ్ల అద్దెలు, విద్యా ఫీజులు, వైద్యం తదితర ఖర్చులు పెరిగిన నేపథ్యంలో వేతనాలు తగ్గించడం అన్యాయమని పేర్కొన్నారు. సంవత్సరాల అనుభవం, సేవలను పరిగణనలోకి తీసుకుని పాత వేతనాలు, హోదాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

2026-27 ఆర్థిక సంవత్సరానికి పొరుగు సేవల సిబ్బంది సేవలను కొనసాగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల నేపథ్యంలో, గతంలో పొందుతున్న



వేతనాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఏకరీతి విధానం అమలు చేసి, వేతనాలను తగ్గించకుండా జీవన వ్యయానికి అనుగుణంగా పెంచాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# పేటలో ఉపసర్పంచ్‌ల ఫోరం ఏర్పాటు

- ఉపసర్పంచ్‌ల సమస్యల పరిష్కారమే లక్ష్యం
- గ్రామాల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తాం



**పెద్ద శంకరంపేట, సెప్టెంబరు 1 (జనంసాక్షి):** గ్రామ పంచాయతీల ఉపసర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలనే లక్ష్యంతో ఉపసర్పంచ్‌ల ఫోరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫోరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఫోరం అధ్యక్షుడిగా జి. రాజు, ఉపాధ్యక్షుడిగా డి. సంగమేశ్వర్, కార్యదర్శిగా జె. లింగరాజు, ప్రధాన కార్యదర్శిగా సంగయ్య, కోశాధికారిగా నర్సింలు ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ఉపసర్పంచ్‌ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఉపసర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా ప్రజాప్రతినిధులుగా తమవంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉపసర్పంచ్‌లందరినీ సమన్వయం చేసుకుంటూ ఫోరం ద్వారా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

## ఉద్యోగుల సమస్యలు
# పరిష్కరించాలి: పిఆర్‌టి యు డిమాండ్



**ఎర్రవల్లి, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పి ఆర్ టి యు - టీఎస్ మంగళవారం 'చలో హైదరాబాద్'కు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో జిల్లా పిఆర్‌టియు - టీఎస్ సభ్యులు బీచుపల్లి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న పి ఆర్ సి, డి ఎ లను త్వరగా అమలు చేయాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇతర దీర్ఘకాలిక సమస్యలపై కూడా ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని వారు కోరారు. ముఖ్యంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఎలాంటి ఆటంకాలు లేకుండా పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. జీవో 317 బాధితులకు న్యాయం చేయడంతో పాటు, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌ను ప్రభుత్వానికి గట్టిగా వినిపిస్తామన్నారు. ఈ మహాధర్నాకు జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# పెద్ద శంకరంపేటలో కట్టె మిషన్ ఇష్టారాజ్యం..!

- "నన్నెవరూ ఏమీ చేయలేరు.. నా వెనుక బడా నేత ఉన్నాడు" అంటూ యజమాని ధీమా?
- భారీగా కలప నిల్వలు.. అనుమతులు, రవాణా వివరాలపై ప్రశ్నలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్న అధికారులు.. తనిఖీలు మాత్రం ఎక్కడ?
- కట్టె మిషన్ వ్యవహారంపై సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్



**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేట పట్టణ పరిధిలో ఓ కట్టె మిషన్ నిర్వహణ తీరుపై తీవ్ర చర్చ జరుగుతోంది. కట్టె మిషన్ పరిసరాల్లో భారీగా కలపను నిల్వ ఉంచి కార్యకలాపాలు కొనసాగిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. నిబంధనలకు అనుగుణంగా కట్టె మిషన్ నిర్వహిస్తున్నారా? కలప నిల్వలు, రవాణాకు సంబంధించిన పత్రాలు సక్రమంగా ఉన్నాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.

**అధికారులంటే లెక్కలేదా..?**

స్థానికుల కథనం ప్రకారం.. కట్టె మిషన్ యజమాని అధికారులపై ధీమాగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. "నన్నెవరూ ఏమీ చేయలేరు.. నా వెనుక బడా నాయకుడు ఉన్నాడు" అంటూ ఆయన చెప్పుకుంటున్నారని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంలో వాస్తవమెంత? రాజకీయ అండదండలు ఉన్నాయా? అన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

**భారీగా కలప నిల్వలు.. ఎక్కడి నుంచి?**

కట్టె మిషన్ వద్ద పెద్ద మొత్తంలో కలప దుంగలు, కట్టెలు నిల్వ ఉంచిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇంత భారీగా కలపను ఎక్కడి నుంచి తీసుకువచ్చారు? వాటి కొనుగోలు, రవాణాకు సంబంధించిన ధ్రువ పత్రాలు ఉన్నాయా? కలప రవాణా నిబంధనలు పాటిస్తున్నారా?అన్న అంశాలపై సంబంధిత శాఖలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కేవలం కట్టె మిషన్ అనుమతులు ఉన్నాయా లేదా అన్నదే కాకుండా.. నిల్వ చేస్తున్న కలపకు చట్టబద్ధమైన ఆధారాలు ఉన్నాయా? రవాణా సమయంలో అవసరమైన అనుమతులు తీసుకున్నారా? మిషన్ నిర్వహణలో పర్యావరణ, అగ్నిమాపక, స్థానిక సంస్థల నిబంధనలు పాటిస్తున్నారా? అన్న కోణాల్లోనూ అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**చర్యలు ఎందుకు కనిపించడం లేదు?**

స్థానికంగా ఇలాంటి ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారా? నిర్వహించి ఉంటే ఏం గుర్తించారు? నిబంధనలకు విరుద్ధంగా ఏమైనా ఉంటే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు లేవని స్థానికులు అంటున్నారు. అధికారులు కేవలం ఫిర్యాదులు వచ్చిన తర్వాత స్పందించడం కాకుండా.. పట్టణ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నట్లు అనుమానం ఉన్న కట్టె మిషన్లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

**రాజకీయ అండ ఉందా..? విచారణతోనే తేలాలి**

కట్టె మిషన్ యజమాని వెనుక బడా రాజకీయ నాయకుడి అండ ఉందన్న ప్రచారం ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అయితే ఇది నిర్ధారిత విషయం కాదని, కేవలం స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణ మాత్రమేనని స్పష్టత అవసరం. సంబంధిత అధికారులు స్వతంత్రంగా విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడిస్తేనే ఈ ప్రచారానికి తెరపడనుంది.

**కలప నిల్వలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

అనుమతులు, కలప రవాణా పత్రాలు, నిల్వల వివరాలు, కట్టె మిషన్ నిర్వహణకు సంబంధించిన అనుమతులను అధికారులు సమగ్రంగా పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## రేజింతల్‌లో పౌర హక్కులపై అవగాహన



**న్యాల్‌కల్, ఆగస్టు 31, (జనంసాక్షి):** మండలంలోని రేజింతల్ గ్రామంలో పౌర హక్కులపై అవగాహన కల్పించారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో.. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ప్రతినెల 30, 31న నిర్వహించనున్న పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని నిర్వహించారు. సభకు హాజరైన స్థానిక యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికార, విపక్ష పార్టీ శ్రేణులు, తదితరులకు ఉప తహసిల్దార్ రాజిరెడ్డి, రెవిన్యూ ఇన్స్ పెక్టర్ శ్యామ్ రావ్, తదితరులు "పౌర హక్కులపై" అవగాహన కల్పించారు. కుల, మతాలు, మహిళ, పురుషులు, దివ్యాంగులు, తదితరులకు వర్ణ వివక్ష లేకుండా హక్కులు అందరికీ సమానమైనవని వివరించారు. హక్కులను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కేసులు తప్పవని ఉప తహసిల్దార్ అన్నారు. కార్యక్రమంలో జీపీఓ, అంగన్వాడి కార్యకర్తలు, స్థానిక యువత, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక శారీరక బలాన్ని ఇస్తాయి


- మున్సిపల్ చైర్మన్ అరుణ, ఎంఈఓ నరేందర్
- అట్టహాసంగా ఆరంభమైన మండలస్థాయి ఎస్జిఎఫ్ క్రీడలు



**చేర్యాల, సెప్టెంబర్ 01(జనంసాక్షి):** చేర్యాల పట్టణంలో మూడు రోజుల పాటు జరిగే ఎస్జిఎఫ్ క్రీడల ప్రారంభోత్సవాన్ని మున్సిపల్ చైర్మన్ అరుణ, ఎంఈఓ బైర నరేందర్ మంగళవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల వల్ల విద్యార్థుల్లో దాగిన ప్రతిభ, ఏకాగ్రతతోపాటు మానసిక శారీరక ఆరోగ్యం పెంచుతాయని తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులను 8,14,17 సంవత్సరాల గ్రూపులో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ లో సెలక్షన్స్, పోటీలు ప్రారంభించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు మెడల్స్ అందించారు. ఈ ప్రారంభోత్సవంలో కౌన్సిలర్ల గీతాంజలి, కొమ్ము రాజేశ్వరి, దుర్గయ్య ప్రసాద్, క్రీడల కన్వీనర్ రామేశ్వర్ రెడ్డి, ఎంఆర్ మూర్తి, మండలంలోని పాఠశాలల పిఈటి లు పాల్గొన్నారు.

## యూరియా యాప్ కష్టం ఇంతింత కాదయా

- దుకాణాల్లో యూరియా యాప్‌లో కనిపించడం లేదు




**తూప్రాన్, సెప్టెంబర్ 1(జనంసాక్షి):** దుకాణాలలో యూరియా ఉంది, కానీ ఆప్‌లో యూరియా చూపించడం లేదంటూ మనోహరాబాద్ మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. యూరియా బుకింగ్ పై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మనోహరాబాద్ మండల వ్యవసాయ శాఖ అధికారులు గత నెల రోజుల నుండి ప్రతిరోజు యూరియా లారీ లోడ్ వచ్చింది, కేంద్ర ప్రభుత్వ అప్‌లో యూరియా బుక్ చేసుకోమని చెప్తున్నారు, కానీ వాస్తవానికి ఈ ఫ్రేమ్ వర్క్ ఫర్టిలైజర్ ఆప్‌లో మెదక్ జిల్లా మొత్తంలో కనీసం ఒక్క ఫర్టిలైజర్ షాప్ కూడా చూపించట్లేదు, మరి యాప్‌లో ఫర్టిలైజర్ షాప్ చూపించకపోతే రైతులు యూరియాని ఎలా బుక్ చేసుకుంటారు, అలాగే ఈ యాప్ ఎప్పుడు ఓపెన్ అవుతుందో ఎవరికీ అర్థం కావట్లేదు, ఎప్పుడో ఒక టైంలో స్టాక్ చూపించిన రెండు నిమిషాలు మాత్రమే చూపిస్తుంది, మరి ఈ విధంగా యూరియా బుకింగ్ ఉంటే రైతులు ఎట్లా యూరియాను బుక్ చేసుకుంటారనీ ప్రశ్నిస్తున్నారు. యూరియాకై పక్క మండలాలకు వెళితే వాళ్లు గంట మందు తీసుకుంటేన యూరియా ఇస్తామని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ఈ ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ యాప్ లో స్టాక్ ను చూపించేలా, రైతులు సులువుగా యూరియాను బుక్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## జిల్లాస్థాయి చెస్ పోటీలలో ప్రజెంటేషన్ హై స్కూల్ విద్యార్థి హరిచరణ్ ప్రతిభ




**చేర్యాల, సెప్టెంబర్ 01(జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా స్థాయిలో నిర్వహించిన ఓపెన్ చెస్ టోర్నమెంట్-2026 పోటీ లలో చేర్యాల ప్రజెంటేషన్ హై స్కూల్ 10వ తరగతి విద్యార్థి పి.హరిచరణ్ అద్భుత ప్రతిభ కనబరిచి 10వ స్థానం సాధించాడు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయిలో వివిధ పాఠశాలలకు చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులతో పోటీపడి హరిచరణ్ ఈ ఘనత సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. పోటీలో హరిచరణ్‌కు ట్రోఫీ తోపాటు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించలనేది మా స్కూల్ ముఖ్య ఉద్దేశం. మా విద్యార్థి హరిచరణ్ జిల్లా స్థాయిలో 10వ స్థానం సాధించడం పాఠశాలకు గర్వకారణం, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాం అని తెలిపారు. హరిచరణ్‌ను ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోతి, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం అభినందించి, తదుపరి స్థాయి పోటీలకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి





**తూప్రాన్,సెప్టెంబర్ 1(జనంసాక్షి):** మొక్కలు నాటి ప్రతి ఒక్కరూ వన మహోత్సవం ఉద్యమంగా చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో మొక్కలు నాటే వన మహోత్సవం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం రోజు సర్పంచి కందల రాజనర్సింహా పాలకవర్గ సభ్యులు గ్రామస్థులతో కలిసి పల్లి పెద్ద చెరువు కట్టమీద మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల నాటడం వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి రామ్ రెడ్డి పాలకవర్గ సబ్యులు సాదు సత్యనారాయణ, సలీం, అరుణ్, మహిపాల్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

- యూనియన్ జిల్లా నేత జయప్రకాశ్ డిమాండ్

**రాజోళి/గద్వాల, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు ఆర్.పి.జయప్రకాశ్ డిమాండ్ చేశారు. ఒకటో, రెండో ఏఎన్ఎంలతో పాటు యూరోపియన్ ఏఎన్ఎంలు, అర్బన్ ఏఎన్ఎంలపై ఉన్న పని ఒత్తిడిని తగ్గించాలని కోరారు. అలాగే ఏఎన్ఎంలకు నిబంధనల ప్రకారం సెలవులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించు.

## హామీల అమలులో కాంగ్రెస్ వైఫల్యంపై బీఆర్ఎస్ ధర్నా విజయవంతం చేయండి

- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్



**మునిపల్లి, సెప్టెంబర్ 01(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫల మైందని టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్ అన్నారు. మంగళవారం మునిపల్లి మండలంలోని ఖమ్మంపల్లి శివారులో గల పీఎస్ఆర్ గార్డెన్‌లో మండల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ... రాష్ట్రం లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల హామీల అమలులో వైఫల్యాన్ని ప్రశ్నిస్తూ, ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2న ఉదయం 10.30 గంటలకు జోగిపేటలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మండల మాజీ ప్రధాన కార్యదర్శి మంతూరి శశికుమార్, మాజీ ఉపాధ్యక్షులు గడ్డం భాస్కర్, కుమ్మరి శేఖర్, సర్పంచ్ రమేష్, మాజీ సర్పంచులు ఎడ్ల శంకర్, బాగన్న, తాటిపల్లి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం




**బెజ్జంకి, సెప్టెంబర్ 1,(జనంసాక్షి):** బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడటాన్ని బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ దొడ్ల ప్రశాంత్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో హింస, దాడులు, గుండాగిరికి తావులేదని అన్నారు.రాజకీయంగా ఎదుర్కోలేక భౌతిక దాడులకు పాల్పడటం కాంగ్రెస్ పార్టీ అసహనానికి, చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు.బీజేపీ కార్యాలయంపై దాడి అంటే కేవలం కార్యాలయంపై దాడి కాదని,ప్రజాస్వామ్య విలువలపై దాడి అని అన్నారు. ఇలాంటి గుండాగిరి రాజకీయాలను బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. దాడులకు పాల్పడితే బీజేపీ కార్యకర్తలు భయపడరని, ప్రజల కోసం, ధర్మం కోసం, ప్రజాస్వామ్యం కోసం తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. బీజేపీ కార్యకర్తల సహనాన్ని బలహీనతగా భావించవద్దని,పోరాటమే తమ బలం ప్రజలే తమ అండ అని దొడ్ల ప్రశాంత్ అన్నారు.

## నిరుపేద మహిళ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాల



**శివ్వంపేట, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు కూలిపోయి నిరాశ్రూలైన కమ్మరి రాధిక బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పిల్లుట్ల మాజీ సర్పంచ్ పెద్దపులి రవి, వాలీబాల్ నేషనల్ ప్లేయర్ సంద్ర వినోద్ లు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్మరి రాధిక ఇల్లు పూర్తిగా శిథిలమై నివసించేందుకు ఇల్లు లేకుండా పోయిందని, వెంటనే ప్రభుత్వ అధికారులు స్పందించి ఆమెకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా గత సంవత్సరం కమ్మరి రాధిక భర్త కమ్మరి భాస్కర్ ఆటో డ్రైవర్ అప్పుల బాధతో ఉరివేసుకొని మృతి చెందగా అప్పటినుంచి కమ్మరి రాధిక కు కుటుంబ పోషణ భారమై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని వారు తెలిపారు. రాధిక కుటుంబ సమస్యలను తెలుసుకున్న శివ్వంపేట మాజీ జెడ్పిటిసి పబ్బా మహేష్ గుప్తా వాలీబాల్ నేషనల్ ప్లేయర్ సంద్ర వినోద్ ద్వారా 5వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బాధిత మహిళకు మంగళవారం అందజేయించారు. ఈ కార్యక్రమంలో గులయ్య గారి సుదర్శన్, బాసంపల్లి శ్రీధర్ గౌడ్, కామారం కిషోర్ రెడ్డి, పిల్లి శివకుమార్, లింగోజిగూడ శ్రీకాంత్ నాయక్ తదితరులు ఉన్నారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

## మొక్కలను సంరక్షించవలసిన బాధ్యత అందరిదీ



**వెల్దుర్తి, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** పచ్చని చెట్లతో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంత మానవాళి మనుగడకు ఎంతో దోహదపడుతుందని వెల్దుర్తి కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం వెల్దుర్తి శ్రీ రాజారావు సరస్వతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల చేత మొక్కలు నాటడం జరిగింది. నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నాటి నామొక్కే భవిష్యత్తులో మహావృక్షమై ఆ వృక్షాలు పర్యావరణ సమతుల్యతకు ఎంతగానో దోహద పడతాయని ఆయన అన్నారు పర్యావరణం సమతుల్యంగా ఉండాలంటే విధిగా ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతలు భుజాన వేసుకోవలసిన బాధ్యత ఎంతైనా ఉందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నరసింహులు మదన్మోహన్ నాందేవ్ శమయ్య శ్రీనివాస్ బాలకృష్ణ స్వామి వెంకటేష్‌తో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీస్, మైనార్టీ మహిళలు





**సంగారెడ్డి, సెప్టెంబరు 1 (జనంసాక్షి):** రాఖీ పౌర్ణమి సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆత్మీయత, సోదరభావం వెల్లివిరిసింది. బ్రహ్మకుమారీస్‌తో పాటు మైనార్టీ మహిళలు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కి రాఖీ కట్టి, రాఖీ పండుగ పురస్కరించుకొని మంగళవారం సంగారెడ్డి పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం శుభాకాంక్షలు తెలిపారు తెలిపారు.

రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ప్రేమాభిమానాలకు ప్రతీక అని చింత ప్రభాకర్ అన్నారు. బ్రహ్మకుమారీస్, మైనార్టీ మహిళలు ఎమ్మెల్యేకు రాఖీ కట్టి తమ ఆప్యాయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారితో ఆత్మీయంగా పలకరించారు.

## ఇల్లు కాలిపోయిన భాదితునికి ఆర్థికసాయం అందించిన మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**రాజాపూర్, సెప్టెంబర్ 1 (జనంసాక్షీ):**
రాజపూర్ మండలం తిరుమలాపూర్ గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు, పూర్తి ఆస్తి కోల్పోయిన భీమయ్య కుటుంబాన్ని పరామర్శించి 20వేల రూపాయల ఆర్థిక సహాయం అందించిన మాజీ ఎమ్మెల్యే డా.సి.లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్ , సర్పంచ్ బంగారి సంతోష్ వెంకటేష్, మాజీ సర్పంచ్ మహేశ్వరి మహిపాల్ రెడ్డి, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపిఎస్ పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

- బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల నిరసన



**బెజ్జంకి,సెప్టెంబర్ 1,(జనంసాక్షి):** పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా రాష్ట్రవ్యాప్త జాక్ పిలుపులో భాగంగా మంగళవారం బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్) రద్దుచేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరించాలని, 51 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో వేతన సవరణ సంఘాన్ని అమలు చేయాలని,పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగులకు ఎన్ఈహెచ్ఎస్ ఆరోగ్య కార్డుల సేవలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు.రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని నాయకులు నిర్ణయించారు.సెప్టెంబర్ 10న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు బి.వి.ప్రవీణ్‌కుమార్,జిల్లా కమిటీ సభ్యుడు సింగిరెడ్డి మనోహర్‌రెడ్డి,ఎస్టీయూ జిల్లా కోశాధికారి రామంచ రవీందర్,మండల అధ్యక్షుడు నారోజు శంకరాచారి,ఎస్టీయూ నాయకులు సతీష్,తోటపల్లి శ్రీనివాస్‌రావు,సత్యం,పుల్లూరి ప్రభాకర్,తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది డీటీ ఆయేషా రఫత్,సీనియర్ అసిస్టెంట్ సురేందర్,టైపిస్ట్ రమేష్ ఆర్ఐ సుహాసిని,ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పంట పొలాల్లో విద్యార్థులు - వ్యవసాయ విద్య అవగాహన



**రాజాపూర్, సెప్టెంబర్ 1(జనంసాక్షీ):** పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజాపూర్ యందు కొనసాగుతున్న వ్యవసాయ వృత్తి విద్య విభాగమునకు సంబంధించిన విద్యార్థులు ఈరోజు రాజపూర్ శివారులోని ఇబ్రహీంపల్లి గ్రామ పరిసరాలలో శాంతమ్మ పొలం సందర్శించి పండిస్తున్నటువంటి వరి, మొక్కజొన్న, మరియు మక్కల పంటలను సునిశితంగా పరిశీలించి పంటల వివరాలు సేకరించారు.

పంట పొలాల్లో అనుసరించినటువంటి వ్యవసాయ పద్ధతులు, నేలస్వభావము?, విత్తనాల యొక్క ప్రాధాన్యత, వివిధ రకాల పురుగుమందులు, పంటకు బలం చేకూర్చేటువంటి యూరియా, పంటల సాగు ద్వారా ఆర్జించే లాభనష్టాల గురించి తెలుసుకున్నారు. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా తట్టుకునేటువంటి వంగడాల గురించి అడిగి తెలుసుకున్నారు. తక్కువ నీరు మరియు మిత పెట్టుబడి తో ఏ పంటలు పండించవచ్చు అడిగి అవగాహన కల్పించుకున్నారు.

పంట పొలాల పరిశీలన నిజజీవితంలో ఎంతో ఉపయోగపడుతుందని పంటలపై చేసేటువంటి శ్రమను గౌరవప్రదమైనదిని ప్రశంసించారు. దేశాభివృద్ధిలో ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం ప్రముఖ పాత్ర పోషిస్తుందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు.

ఇట్టి కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మరియు వ్యవసాయ ఉపాధ్యాయుని ఇందిరా మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు పనిచేయాలి

- కల్హేర్ మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

**కల్హేర్ సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** మండలంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం కల్హేర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఎమ్మెల్యే శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అమలవుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల సమస్యల పరిష్కారం, రైతాంగ సంక్షేమం, రహదారుల మరమ్మతులు, విద్యా వ్యవస్థ బలోపేతం, వైద్య సదుపాయాల మెరుగుదలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**తాగునీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి...**

గ్రామాల్లో బోర్లతో పాటు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని సంబంధిత అధికారులను ఆదేశించారు.



గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.

సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో, సఖ్యతతో పనిచేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, మండలంలోని గ్రామాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం కల్హేర్ మండల కేంద్రానికి చెందిన పలువురు లబ్ధిదారులకు నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# సురభి ఉచిత వైద్య సేవలు అభినందనీయం

- కాంగ్రెస్ నేత మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి
- సురభి ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన






**చేర్యాల, సెప్టెంబర్ 01(జనంసాక్షి):** సురభి ఆస్పత్రి వారు నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి అన్నారు. సురభి ఆసుపత్రి మరియు మెడికల్ కళాశాల చైర్మన్ హరేందర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆకునూరు గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. సుమారు 500 మంది ప్రజలు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కొమ్ము రవి, సురభి పీఆర్వో సూరం పర్శరాములు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొమ్మూరి ప్రతాపరెడ్డి హాజరై మాట్లాడుతూ.. ప్రస్తుతం పంటలకు రసాయనిక ఎరువులు, కెమికల్స్ ఎక్కువగా వాడటం వల్లనే అనేక అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి సిద్ధమైన ఎరువులతో పండించిన పంటలను తీసు కుంటే ఆరోగ్యంగా ఉంటామని సూచించారు. ప్రజల ఆరోగ్యం కోసం సురభి ఆస్పత్రి అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ శిబిరంలో సురభి వైద్య బృందం పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సురభి హాస్పిటల్ మేనేజ్ మెంట్ వెంకటేశ్వర రావు, పీఆర్ఓ వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంజె మల్లేశం, మద్దూరు మండల అధ్యక్షుడు మారేళ్ల భాస్కర్ రెడ్డి, కొత్త దొమ్మాట సర్పంచ్ పర్వతం ఎల్లవ్వ-చంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ కరీమద్దిన్, గ్రామ మాజీ సర్పంచ్ వెలుగల లావణ్య రఘువీర్, ఉప సర్పంచ్ కదారి పల్లవి భాస్కర్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకుల రాజు, యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి అందె నాని బాబు, జిల్లా నాయకులు బోయిని శ్రీనివాస్, భూమని బాలరాజు, తోర్ల వేణు, గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు, సురభి హాస్పిటల్ డాక్టర్స్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, పెడియాట్రిక్, ఈఎన్‌టీ, గైనకాలజీ, ఆప్తాల్‌మాలజీ, అన్ని రకాల డిపార్ట్మెంట్ డాక్టర్స్, సపోర్టింగ్ స్టాఫ్, మార్కెటింగ్ బృందం పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనాలను విడిపించుకోవాలి

- ఈ నెల 12వ తేదీ వరకు ప్రత్యేక రుసుము



**జగదేవ్‌పూర్ సెప్టెంబర్ 1 (జనం సాక్షి):** డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా పోలీసులకు పట్టుబడిన వాహనాలను విడిపించుకోవాలని జగదేవ్‌పూర్ ఎస్ఐ జి.కృష్ణారెడ్డి చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో పట్టుబడిన వాహనాలకు ప్రత్యేక రుసుము చెల్లించే అవకాశాన్ని కల్పించారని తెలిపారు. నాలుగు చక్రాల వాహనానికి 4వేల రూపాయలు, ద్విచక్ర వాహనానికి 2 వేల రూపాయల చొప్పున లోక్ అదాలత్‌లో చెల్లించి తమ వాహనాలను విడిపించుకోవాలని పేర్కొన్నారు. కాగా ఈ అవకాశం ఈ నెల 12వ తేదీ లోక్ అదాలత్ వరకు మాత్రమే ఉందని చెప్పారు. అయితే 2025వ సంవత్సరం అక్టోబర్ నెల 1వ తేదీకి ముందు పట్టుబడిన అన్ని వాహనాలకు కేవలం ఒక వెయ్యి రూపాయలు మాత్రమే చెల్లించి విడిపించు కోవచ్చని సూచించారు. కావున అర్హత కలిగిన వాహన యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ కృష్ణారెడ్డి కోరారు.

## కరెడ్ల రాజేశ్వర్ రెడ్డిని పరామర్శించిన జర్నలిస్టులు



**చేర్యాల, సెప్టెంబర్ 01(జనంసాక్షి):** కెఆర్ఆర్ ట్రస్ట్ చైర్మన్, సీనియర్ జర్నలిస్టు కరెడ్ల రాజేశ్వర్ రెడ్డి తల్లి ప్రమీల ఇటీవల అనారోగ్యంతో బాధ పడుతూ మృతి చెందిన విషయం తెలుసుకున్న చేర్యాల మండల సీనియర్ జర్నలిస్టులు, పలువురు రాజకీయ నాయకులు పరామర్శించి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## డివైడర్‌ను ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు..



**మహమ్మదాబాద్, సెప్టెంబరు 01 (జనంసాక్షి):** మహమ్మదాబాద్ మండలంలో మంగళవారం ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. మండలంలోని చౌదర్‌పల్లి పెద్దతండాకు చెందిన రంజ్యా నాయక్, (50), తండ్రి కూర్మ నాయక్, ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మహమ్మదాబాద్ ఫారెస్ట్ కార్యాలయం సమీపంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో ఆయనకు గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న, 108,సిబ్బంది ప్రాథమిక చికిత్స కొరకు, మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో బతుకమ్మ ఆడుతూ ఉద్యోగుల నిరసన



**నంగునూరు, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** రాష్ట్రస్థాయి పాలి టెక్నిక్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు శక్తి కి వ్యతిరేకముగా స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగులు 16వ రోజు భోజన విరామ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో కలపడాన్ని వ్యతిరేకిస్తూ బతుకమ్మలు పేర్చి బతుకమ్మ పాటలతో నిరసన తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో కలపడం వలన పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య దొరకక పోగా ఆర్థిక భారంతో ఉన్నత విద్యా అవకాశాలు సన్నగిల్లె ప్రమాదం ఉందని తెలిపారు. కళాశాల ప్రాంగణంలో మహిళా ఉద్యోగులు బతుకమ్మలు పేర్చి బతుకమ్మ పాటతో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో తెలంగాణ పాలిటెక్నిక్ ఐక్య కార్యాచరణ సమితి సహ అధ్యక్షులు శ్రీ బూరం అభినవ్, రాజు, పాతూరి శ్రీనివాస రెడ్డి, రాజేష్, రామకృష్ణ, విజయ్ కుమార్, జ్యోతి, వైదేహి గారు, సంతోష్ గారు, నవీన్ గారు, కమల్ అహ్మద్, మంజుల,వాణి , భాగ్యలక్ష్మి, బాలమణి ఇతర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పాతబజార్‌లో ఘనంగా పోచమ్మ బోనాలు

- పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** మున్సిపాలిటీ పరిధిలోని పాతబజార్ ఊరకుంట శ్రీ పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలు సాంప్రదాయబద్ధంగా బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వేడుకల్లో జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాల నడుమ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రసమయిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదు

- ఇథనల్ ఫ్యాక్టరీ వల్ల మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదా..?
- బీఆర్ఎస్ నాయకుడు ఘనపురం తిరుపతి



**బెజ్జంకి,సెప్టెంబర్ 1(జనంసాక్షి):** మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో మానకొండూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డా.రసమయి బాలకిషన్‌పై కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను బీఆర్ఎస్ యువజన కార్యనిర్వాహక అధ్యక్షుడు ఘనపురం తిరుపతి తీవ్రంగా ఖండించారు. రాజకీయ విమర్శలు మాని మండల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీతో మండల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పశువులు,చేపలు మృతి చెందుతున్నాయని, నీరు కలుషితమవుతున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇథనాల్ యాజమాన్యానికి కాంగ్రెస్ నాయకులు కొమ్ముకాస్తూ ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యం,పశు,వృక్ష,జంతు సంరక్షణపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని,ఇకనైనా అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని తిరుపతి హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామంచ పరశురాములు,మాషం బాబు,కల్లూరి అజయ్‌యాదవ్,మాంకాళి నగేష్, లింగాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ సంక్షేమ పథకాల అమలుకై ఉద్యమించాలి

- ఈ నెల 3న మహా బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి
- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు లింగాల కృష్ణ మాదిగ



**సిద్దిపేట, సెప్టెంబర్ 01(జనంసాక్షి):** ఎస్సీ సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 3న సిద్దిపేట జిల్లా పరిధిలో నిర్వహించనున్న మహా బైక్ ర్యాలీని విజయవంతం చేయా లని ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు లింగాల కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేట అంబేద్కర్ సర్కిల్ వద్ద బైక్ ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ పిలుపు మేరకు, రాష్ట్ర అధ్యక్షులు కేదాసి మోహన్ మాదిగ ఆధ్వర్యంలో ఈ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మాదిగలు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, దళితులు, ప్రజా స్వామికవాదులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

**ఎమ్మార్పీఎస్ ప్రధాన డిమాండ్లు:**

1.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల పథకాన్ని వెంటనే అమలు చేసి, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

2.అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల పంట భూమి ఇవ్వాలి.

3.జీవో నంబర్లు 58, 59 కింద ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న దళిత కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితులకు స్వయం ఉపాధి రుణాలు అందించేందుకు రూ.15 వేల కోట్లు కేటాయించాలి.

4.పారిశుద్ధ్య కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.20 వేలు చెల్లించాలని, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా స్వీకరించి అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో సంక్షేమ పథకాలు సాధించే వరకు విశ్రమించకుండా ఉద్యమాన్ని కొనసాగిస్తామని లింగాల కృష్ణ మాదిగ హెచ్చరించారు. దళితుల ఆత్మగౌరవం, ఆర్థిక అభివృద్ధే ఎమ్మార్పీఎస్ లక్ష్యమని పేర్కొన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్దిని రాజ మల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి బొంబాయి వెంకన్న, రాష్ట్ర నాయకులు భూమిగారి రాజేందర్, దేవులపల్లి రాజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోడ ప్రశాంత్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బలిగారి కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు జహంగీర్, జిల్లా నాయకులు దప్పు ఎల్లన్న, టౌన్ ఇంచార్జి గజపాక ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి



- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు అవసరం
- ఉత్సవ కమిటీ, మండపాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలి
- అధికారులతో సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్,ఎస్పీ

**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 1 (జనంసాక్షి);** గణేష్ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి వివిధ శాఖల అధికారులతో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తలు, నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లపై కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. డివిజన్, మండల స్థాయిలోనూ ఉత్సవ కమిటీ సభ్యు లు, మండపాల నిర్వాహకులతో సంబంధిత అధికారులు సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశం చేయాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు విద్యుత్ శాఖ అధికారులతో నిర్వాహకులు సేఫ్టీ సర్టిఫికేషన్ తీసుకునేలా చూడా లన్నారు. వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించే సమయం లోనూ కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తా నుంచి నది అగ్రహారం వెళ్లే దారిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో బీచుపల్లి, నది అగ్రహారంలోనీ కృష్ణానది వద్ద పెద్ద సంఖ్యలో నిమజ్జనం చేయనున్న నేపథ్యంలో అక్కడ ముఖ్యమైన రోజుల్లో క్రేన్సుతోపాటు గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. లైటింగ్, భారీ కేడ్స్ కూడా అవసరమని, ప్రధాన రహదారుల్లో గతుకులు లేకుండా మరమ్మత్తులు చేయించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. నిమజ్జనం రోజుల్లో నిర్దేశిత సమయాల్లో మద్యం దుకాణాలను మూసివేయడం అవసరమని, ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా పోలీస్ శాఖ అధికారులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. వినాయక మండపాల వద్ద రాత్రి 10 గంటల తర్వాత మైక్ శబ్దాలు ఉండరాదని, ముఖ్యంగా ఆసుపత్రులు, విద్యాసంస్థల సమీపంలో డీజే సౌండ్స్ లేకుండా చూడాలన్నారు. శానిటేషన్, తాగునీరు, అత్యవసర వైద్య సదుపాయాలు, తదితర అన్ని విషయాల్లో సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి జిల్లాలో వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేలా పనిచేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరపున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసు కుంటూ పనిచేస్తామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందు బాటులో ఉండేందుకు ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లను, హెల్ప్ లైన్లను ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు,ఆర్డీవో శ్రీనివాసరావు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బస్సు సమస్యను తీర్చండి



**శివ్వంపేట, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామ సర్పంచ్ అరుణ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆమె గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. గత సంవత్సరం డిసెంబర్ 31న గ్రామస్తులతో కలిసి తాను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసి, వినమ్రంగా విజ్ఞప్తి చేస్తూ, మా గ్రామానికి బస్సు సదుపాయం కల్పించడం వలన మా గ్రామంతో పాటుగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేస్తూ, డిపో మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించామన్నారు. ఇప్పటి వరకు 8 నెలలు గడిచిపోయిన బస్సు సమస్యను పరిష్కరించలేదని సర్పంచ్ అరుణ రెడ్డి, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా బస్సును ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగస్తులకు, ప్రజలకు ఒక వరంగా మారుతుందని ఆమె అన్నారు. ఈ రవాణా సౌకర్యం ఉదయం 07:30 గంటలకు సికింద్లాపూర్ నుండి మేడ్చల్‌కు వెళ్ళుటకు అలాగే తిరుగు ప్రమాణం నిమిత్తం సాయంత్రం 05:00 గంటలకు మేడ్చల్ నుండి సికింద్లాపూర్‌కు ఏర్పాటు చేయాలని సర్పంచ్, గ్రామస్తులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

# గూడెం-గుంటూరుపల్లి రహదారికి మరమ్మతులు



**బెజ్జంకి, సెప్టెంబర్ 1,(జనంసాక్షి):** మండలంలోని గూడెం నుంచి గుంటూరు పల్లి వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలతో ప్రజలు, వాహనదారులు ఇబ్బం దులు పడుతున్న నేపథ్యంలో మంగళవారం మరమ్మతు పనులు చేపట్టారు. గూడెం సర్పంచ్, బెజ్జంకి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో గుంతల్లో మొరం పోసి రహదారిని చదును చేశారు.వర్షాల కారణంగా రహదారి మరింత దెబ్బతినడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బం దులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టినట్లు శ్రీకాంత్ తెలిపారు.గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని శ్రీకాంత్అన్నారు.

# అత్యాశ.. భయం.. తొందరపాటే సైబర్ నేరగాళ్ల ఆయుధాలు



- అప్రమత్తతతోనే సైబర్ మోసాలకు చెక్: ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** సైబర్ నేరగాళ్లు ప్రజల అత్యాశ, భయం, తొందరపాటును ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. బ్యాంకు అధికారులు, పోలీసులు, ప్రభుత్వ సంస్థల పేరుతో ఫోన్ చేసి ఖాతాలు నిలిచిపోతాయని భయపెట్టడం, ఉద్యోగాలు, రుణాలు, లాటరీలు, బహుమతుల పేరుతో ఆశ చూపించడం వంటి పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీ, యూపీఐ పిన్, పాస్‌వర్డ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. గుర్తుతెలియని లింకులపై క్లిక్ చేయడం, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం, మొబైల్ స్క్రీన్‌ను ఇతరులతో పంచుకోవడం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. సైబర్ మోసానికి గురైతే భయపడకుండా వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. సకాలంలో సమాచారం అందిస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి మొబైల్ వినియోగదారుడు అప్రమత్తంగా ఉండాలని, క్లిక్ చేసే ముందు ఆలోచించాలి.. వివరాలు చెప్పే ముందు ఆగాలి.. అనుమానం వస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలి అని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కావాలంటే దీనికి భవ్య న్యూస్ దినపత్రికకు సరిపోయే మరింత పవర్‌ఫుల్ ప్రధాన శీర్షిక, ఉపశీర్షికలతో కూడా రూపొందించగలను.

గుండారం రోడ్డుపై ఘోర ప్రమాదం..

# కాట్రియాల్‌కు చెందిన చిన్న లింగం మృతి





**రామాయంపేట, సెప్టెంబర్ 1(జనంసాక్షి):** రాజంపేట మండలంలో సోమవారం రాత్రి విషాదకర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల్ గ్రామానికి చెందిన కుమ్మరి చిన్న లింగం (60) బంధువుల ఇంటికి వెళ్లేందుకు సోమవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో ఎక్సెల్ వాహనంపై గుండారం వైపు బయలుదేరారు. పెద్దయిపల్లి గేట్–గుండారం రోడ్డులో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన చిన్న లింగం అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడికి భార్య కుమ్మరి రాజవ్వ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలియడంతో కాట్రి యాల్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

# ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం



- గడపగడపకు బాకీ కార్డులను పంపిణీ చేయాలి: బీఆర్ఎస్

**చేర్యాల, సెప్టెంబర్ 01(జనంసాక్షి):** చేర్యాల పట్టణంలోని వాసవి గార్డెన్ లో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ చేర్యాల పట్టణ, మండల కార్యకర్తల ముఖ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశమును ఉద్దేశించి పట్టణ, మండల అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వరరావు, అనంతుల మల్లేశం, మున్సిపల్ చైర్ పర్సన్ ముస్త్యాల అరుణ బాల నరసయ్య, వైస్ చైర్ పర్సన్ మేడిశెట్టి ఉమా శ్రీధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు అయినా సందర్భంగా ప్రభుత్వ పాలనపై రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి సూచనతో సెప్టెంబర్ 1 నుండి 8వ తారీఖు వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు రేవంత్ రెడ్డి ప్రభుత్వం బాకీపడిన పింఛన్ల పెంపు, మహిళలకు 2500 రూపాయలు, రైతు భరోసా, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ,విద్యార్థులకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగులకు భృతి లాంటి అనేక హామీలను ఇచ్చి రుణపడిన బకాయిలను ప్రజలకు వివరించేందుకు బుధవారం ఉదయం 7 గంటలకు ప్రతి ఇంటి గడపగడపకు బాకీ కార్డులను పంపిణీ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా 3వ తేదీన పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రైతులు, మహిళలు, వృద్ధులు, వికలాంగులతో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది కావున ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు సాగునీరు, యూరియా ఎరువులు, రైతు భరోసా ఇవ్వకుండా పెడుతున్న ఇబ్బందులను, మహిళలకు, వృద్ధులకు ఇచ్చిన హామీలు విఫలమైన విధానాన్ని ప్రజలకు వివరించాలని అని అన్నారు. పార్టీ ఇచ్చిన ఏడు రోజుల కార్యక్రమాలను ప్రతి కార్యకర్త విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్స్ నిమ్మ సుప్రజ రాజీవ్ రెడ్డి, గీతాంజలి, సదానందం, సురేష్, టౌన్ సెయింట్ సెక్రటరీ బురగోని తిరుపతి గౌడ్, నాయకులు అంకుగారి శ్రీధర్ రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ మంగోల్ చంటి, మహిళా అధ్యక్షురాలు తాడెం రంజిత, ఎక్స్ ఎంపీపీ కర్ణాకర్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, శివ గారి అంజయ్య, యాట యాదగిరి, తోడేంగల రాజేష్, మంచాల కొండ య్య, రాళ్లబండి పరిపూర్ణం, పచ్చిమడ్ల సిద్దిరాములు గౌడ్, యాట బిక్షపతి, ఔశర్ల కిష్టయ్య, కాసెట్టి భాగ్యయ్య ,రాచకొండ బిక్షపతి, భూమిగారి శ్రీరామ్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎల్ఐసీ 70వ సంస్థాపక దినోత్సవం



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** గద్వాల ఎల్ఐసీ బ్రాంచ్ ఆవరణలో 70వ సంస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్రాంచ్ ఎస్‌బీఎం కులశేఖర్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు మాట్లాడుతూ.. 1956 సెప్టెంబర్ 1న దేశంలోని 245 ప్రైవేట్ జీవిత బీమా సంస్థలను జాతీయం చేసి ఎల్ఐసీని ఏర్పాటు చేశారని తెలిపారు.

ప్రజల సొమ్ము ప్రజల శ్రేయస్సుకే అనే లక్ష్యంతో ప్రారంభమైన ఎల్ఐసీ 70 ఏళ్లుగా దేశ ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారీగా పెట్టుబడులు అందిస్తోందని పేర్కొన్నారు.

2026 మార్చి నాటికి దేశవ్యాప్తంగా 14.57 లక్షలకు పైగా ఏజెంట్లు, 3,836 కార్యాలయాలతో ఎల్ఐసీ విస్తరించిందన్నారు. 25.35 కోట్లకు పైగా వ్యక్తిగత పాలసీలు, 10 కోట్లకు పైగా గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీలు ఉన్నాయని తెలిపారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో రూ.9.79 లక్షల కోట్ల ఆదాయం, రూ.5.35 లక్షల కోట్ల ప్రీమియం ఆదాయం నమోదు చేసిందన్నారు. పాలసీదారులకు రూ.3.12 లక్షల కోట్లకు పైగా క్లెయిమ్‌లను చెల్లించిందని వివరించారు.

23 ప్రైవేట్ బీమా సంస్థలతో పోటీ పడుతూ 65.16 శాతం మార్కెట్ వాటాతో ఎల్ఐసీ అగ్రస్థానంలో కొనసాగుతోందన్నారు. దేశంతో పాటు 14 ఇతర దేశాల్లోనూ సేవలను విస్తరించిందని తెలిపారు. కార్యక్రమంలో ఏబీఎన్, ఏవోలు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, సిబ్బంది, ఏజెంట్లు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలి

- స్థానిక సంస్థల అదన కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్ బ్యూరో సెప్టెంబర్ 01(జనంసాక్షి):** జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (KGBV) విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత, విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హాస్టల్ సంక్షేమ అధికారులు, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, KGBV ప్రత్యేక అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, విద్యాబోధన, భద్రతా చర్యలపై సమీక్షించారు. వసతి గృహాలు, పాఠశాలల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. చెత్త, పిచ్చిమొక్కలు, పొదలు తొలగించి పాములు, విషపురుగులు సంచరించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన ఏ సమస్య తలెత్తినా వెంటనే స్పందించి అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, ఖ+దీఎల్లో సుమారు 25 వేల మంది విద్యార్థులు ఉన్నారని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అధికారులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంపొందించేలా వారానికి ఒకసారి మోటివేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్లిప్ టెస్టులు, గ్రూప్ డిస్కషన్లు నిర్వహించి విద్యార్థుల ప్రతిభను మెరుగుపరచాలని తెలిపారు. ఆంగ్ల భాషపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ ఆంగ్ల పాఠాలు ప్రారంభించే ముందు 10 నుంచి 15 నిమిషాల




పాటు ప్రాథమిక వ్యాకరణ అంశాలను బోధించాలని సూచించారు. విద్యార్థులకు ఆంగ్లంలో మాట్లాడే అవకాశాలు కల్పించాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని, నెలకు ఒకసారి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బాలికల వసతి గృహాల్లో పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అధికారులు 15 రోజులకు కనీసం ఒకసారి తమ పరిధిలోని వసతి గృహాలు, పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో బసచేసి పరిస్థితులను పరిశీలించాలని అదనపు కలెక్టర్ కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును అధికారులపై నమ్మకంతో అప్పగిస్తున్నారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

ఈ సమావేశంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ అధికారి సునీత, బి.సి సంక్షేమ అభివృద్ధి సంస్థ అధికారి విష్ణు నందన్, జి.సి.డి.ఓ ఆత్ర ఖాద్రి, హాస్టల్ వెల్ఫేర్ ఆధికారులు, కె. జి. బి. వి ప్రత్యేక అధికారులు, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఆ ఆఫీసర్ అడుగు పెట్టాడు - ఆట కట్టించాడు!

**గద్వాల, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** చాలా రోజులుగా జిల్లా కేంద్రంలో కనిపించని తూనికలు, కొలతల శాఖ అధికారి మంగళవారం ఒక్కసారిగా రంగంలోకి దిగడం స్థానికంగా ఆశ్చర్యం కలిగించింది. గద్వాల పట్టణంలోని పలు మటన్, చికెన్ దుకాణాల్లో జిల్లా తూనికలు, కొలతల అధికారి రవీందర్ ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. వినియోగదారులు కొనుగోలు చేసిన మటన్, చికెన్ ను మళ్లీ తూకం వేసి చూడగా బరువులో ఎలాంటి తేడా లేదని అధికారులు తెలిపారు.అయితే దుకాణాల్లో వాడుతున్న ఎలక్ట్రానిక్ త్రాసులకు ధ్రువీకరణ ముద్రలు లేకపోవడాన్ని గుర్తించారు. ముద్రలు లేని 5 తూకపు యంత్రాలపై కేసులు నమోదు చేశారు. ప్రతి దుకాణదారుడు తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ త్రాసులకు ధ్రువీకరణ ముద్ర వేయించుకోవాలని, వినియోగదారులు తూకం సరిచూసుకునేందుకు ప్రమాణ బరువులు అందుబాటులో ఉంచాలని అధికారి ఆదేశించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



**మద్దూరు, సెప్టెంబరు 1 (జనంసాక్షి):** టీజీఈజేఏసీ పిలుపు మేరకు పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా మద్దూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. మంగళవారం భోజన విరామ సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా టీజీఈజేఏసీ నారాయణపేట జిల్లా కో–చైర్మన్లు యశ్వంత్, భీమయ్య, మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా బాధ్యులు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షన్ ఉద్యోగుల హక్కు అని, ఉద్యోగ విరమణ అనంతరం ఆర్థిక భద్రత కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పెన్షన్ విధానంపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. టీజీఈజేఏసీ పిలుపు మేరకు సెప్టెంబరు 10వ తేదీ వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.

# రామాయంపేటలో యూరియా కోసం రోడ్డెక్కినా రైతులు

- యాప్ బుకింగ్ విధానం వద్దు.. నేరుగా యూరియా సరఫరా చేయాలి
- సకాలంలో ఎరువు అందకపోతే పంటలు దెబ్బతింటాయని ఆవేదన

**రామాయంపేట, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** రామాయంపేట మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద యూరియా కొరతపై రైతులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు. పట్టణానికి మూడు లారీల యూరియా చేరినప్పటికీ ఆన్‌లైన్ బుకింగ్ నిమిషాల్లోనే పూర్తవడంతో పలువురు రైతులకు ఎరువు అందలేదు. దీంతో రైతులు మెదక్––సిద్దిపేట ప్రధాన రహదారిపై వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు.గత వారం రోజులుగా యూరియా కోసం ఎదురుచూస్తున్నామని రైతులు తెలిపారు. యూరియా వచ్చిన సమాచారం తెలిసేలోపే ఆన్‌లైన్ బుకింగ్ పూర్తవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేశామని, కీలక సమయంలో యూరియా అందకపోతే పంటలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. చిన్న ఫోన్లు ఉన్న రైతులు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవడం మరింత ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు.

**యాప్ విధానంపై రైతుల అసంతృప్తి...**

ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ విధానం తమకు తలనొప్పిగా మారిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాప్‌తో సంబంధం లేకుండా రైతులను నేరుగా గుర్తించి యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.



ఇతర గ్రామాలతో పోలిస్తే రామాయంపేట రైతులపై నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపించారు. సకాలంలో ఎరువు అందకపోతే వ్యవసాయం చేయడం భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఆరు లారీల యూరియా వస్తుంది అధికారులు**

రైతుల ఆందోళనపై అధికారులు స్పందించారు. మంగళవారం 2 వేల బస్తాల యూరియాను పంపిణీ చేశామని, బుధవారం మరో ఆరు లారీల యూరియాను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు. అధికారులు ఇచ్చిన హామీ మేరకు యూరియా సరఫరా చేసి ప్రతి రైతుకు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

## అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్ల పటివేత

**మక్తల్ సెప్టెంబర్ 01 (జనంసాక్షి):** మండల పరిధిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను మక్తల్ పోలీసులు మంగళవారం పట్టుకుని సీజ్ చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పరిధిలోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న రెండు టిప్పర్లు పట్టుబడ్డాయి. ఎస్ఐ పి. రాజు ఆధ్వర్యం లో వాహనాలను స్వాధీనం చేసుకుని, నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపినా, అక్రమంగా రవాణా లేదా నిల్వ చేసినా ఉపేక్షించేది లేదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# 3వ తేదీన బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కౌడిపల్లి లో ధర్నా

- నిరసన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సారరామ గౌడ్

**కౌడిపల్లి సెప్టెంబర్ 01,(జనంసాక్షి):** ఈ నెల మూడవ తేదీన బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జరగబోయే నిరసన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు సార రామగౌడ్, తెలిపారు. మంగళవారం రోజున మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామగౌడ్, మాట్లాడుతూ... ఆరు గ్యారంటీలు 100 రోజులలో అమలు చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ 1000 రోజులు గడిచినప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. అదేవిధంగా 420 హామీలు చేయకపోవడం పట్ల బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు మండల కేంద్రంలో ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులకు సకాలంలో యూరియా అందించక యాప్ ని ఏర్పాటు చేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. రైతు బంధు ఎకరాకు సంవత్సరానికి 15 వేల రూపాయలు ఇస్తానని మాట చెప్పి మాట ఊసే లేదన్నారు. ఉపాధి కూలీలకు సైతం 12 వేల రూపాయలు ఇస్తానని వాగ్దానం చేసిన ప్రభుత్వం ఎగనామం పెట్టిందన్నారు. 24 గంటల కరెంటు నాణ్యమైన కరెంటు లేకపోవడంతో మోటర్లు స్టాటర్లు కాలిపోయి రైతులు



ఇబ్బందులకు గురవుతున్నారు అని తెలిపారు. వాగ్దానాలను ఎగనామం పెట్టినందుకు నిరసనగా గురువారం రోజున జరగబోయే నిరసన ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, పాల్గొంటారని తెలిపారు. ఇట్టి ధర్నా కార్యక్రమాన్ని మండల పరిధిలోని ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జెడ్పిటిసిలు, అనుబంధ సంస్థ అధ్యక్షులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సార రామగౌడ్, తెలిపారు.

## చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి

- సర్పంచ్ అబ్దుల్ రషీద్
- ఊరుకొండ పేట జడ్పీహెచ్ఎస్‌లో మండలస్థాయి క్రీడల ఎంపికలు



**ఉర్కొండ, సెప్టెంబర్ 01 (జనంసాక్షి);** చదువుతో పాటు క్రీడలలోనూ విద్యార్థులు రాణించాలని గ్రామ సర్పంచ్ అబ్దుల్ రషీద్ అన్నారు. ఊరుకొండ మండలం ఊరుకొండ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమ వారం మండల స్థాయి క్రీడల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా మండల ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, ఎస్సై రమాదేవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అబ్దుల్ రహీం, హెచ్ఎం రామస్వామి, పీడీ జగన్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, కృష్ణయ్య, క్రీడాకారులు, విద్యార్థులులి పాల్గొన్నారు.

## పేట జిల్లా ఆస్పత్రి ఘటనలపై విచారణ



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 1(జనంసాక్షి):** నారాయణపేట ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో వరుసగా జరుగుతున్న మృతి ఘటనలపై తక్షణ విచారణకు ప్రభుత్వం ఆదేశిం చింది.ఈ ఘటనలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీసేందుకు హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యుల బృందాన్ని నారా యణపేటకు పంపించింది. విచారణ బృందంలో డాక్టర్ బాబురావు - పీడియాట్రిక్ సర్జన్, డాక్టర్ కవిత - పీడియాట్రిక్ ప్రొఫెసర్ ఉన్నారు. వీరిద్దరూ నిలోఫ ర్ ఆసుపత్రి, హైదరాబాద్‌కు చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణులు ఉన్నారు. నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ కె. సంపత్ కుమార్ సింగ్, చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుల, సమక్షంలో హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి చెందిన ప్రత్యేక వైద్యుల బృందం విచారణ చేపట్టింది.ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, చికిత్సకు సంబంధించిన వివరాలు, మృతి ఘటన లకు దారితీసిన పరిస్థితు లను ప్రత్యేక వైద్యుల బృందం సమగ్రంగా పరిశీ లించింది. అనంతరం విచారణ నివేదికను ప్రభు త్వానికిసమర్పించనున్నారు.ప్రత్యేక వైద్యుల బృందం సమర్పించే నివేదిక ఆధా రంగా ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది.

## రాష్ట్ర స్థాయి విజ్ఞాన మేళాలో పేట శిశుమందిర్ విద్యార్థుల ప్రతిభ



**నారాయణపేట సెప్టెంబర్ 1(జనంసాక్షి):** విద్యా భారతి ఆధ్వర్యంలో విజ్ఞాన గణిత సంస్కృతి మేళా - 2026లో శిశు మందిరాల రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ ఆగస్టు 30,31, సెప్టెంబర్ 1న ముధోల్ లో జరిగింది.ఈ విజ్ఞాన గణిత సంస్కృతి మేళాలో నారాయణపేట శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల విద్యా ర్థులు ప్రతిభ చాటారు. ఇందులో ప్రదర్శించబడియాల్ విత్ క్లే విభాగంలో శివ ప్రకాష్ (మట్టి తో ఏనుగు బొమ్మను తయారు చేశారు) కిశోర వర్గ విభా గంలో నవీన్ (మట్టితో గుర్రం పై ఝాన్సీ లక్ష్మీబాయి బొమ్మ ను తయారు చేశారు). అందుకు వారి నైపుణ్యం చూసి మొదటి బహుమతి ప్రధానం చేశారు. ఈ ప్రదర్శనలకు గాను రాష్ట్రస్థాయిలో మూడు ప్రథమ బహుమతులు లభించాయి. విజ్ఞాన గణిత సంస్కృతి మేళా లోప్రదర్శించగా,న్యాయనిర్ణేతలను ఆకట్టుకుని ఉత్తమ ప్రదర్శనగా నిలిచాయి. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించడంతో పాఠశాలప్రధానాచార్యులు, ఆచార్య బృందం, తల్లిదం డ్రులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి: టీజీజేఏసీ డిమాండ్

- మంతన్‌గోడ్ పాఠశాలలో నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



**మక్తల్, సెప్టెంబర్ 01 (జనంసాక్షి):** సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు మక్తల్ మండలంలోని మంతన్‌గోడ్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెను శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీవితకాలమంతా ప్రభుత్వానికి, ప్రజలకు సేవలందించిన ఉద్యోగికి వృద్ధాప్యంలో ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత అని గుర్తుచేశారు. పెన్షన్ అనేది ప్రభుత్వం విదిలించే భిక్ష కాదని, అది ఉద్యోగుల హక్కు అని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే సీపీఎస్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ?సెప్టెంబర్ 10న హైదరాబాదులో టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన మహాధర్నాను ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సూర్యచంద్ర, అశోక్, వెంకటేష్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, లక్ష్మీనరసింహాచారి, సునంద, పరమేశ్వరి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ

- సిబ్బంది పనితీరుపై అసంతృప్తి
- శుభ్రత లోపంపై ఎస్ఓకు షోకాజ్..
- వాడ్యాలలో ఫార్మ్‌పాండ్ పనుల తనిఖీ
- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మిడ్జిల్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఆహ్లాద కరమైన వాతావరణం కల్పించడంలో నిర్ల క్ష్యం చేయవద్దని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు.

మంగళవారం మిడ్జిల్ మండలంలోని విస్తృ తంగా పర్యటించి విద్యాసంస్థల పనితీరును పరిశీలించారు.

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలి కల విద్యాలయాన్ని ఆకస్మికతనిఖీకి చేశారు అదనపు కలెక్టర్ అక్కడి పరిసరాలను పరిశీ లించారు.

పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, పొద లు, కంప చెట్లు, గడ్డి అధికంగా పెరిగి ఉండటంతో సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు.



పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి బాధ్యు లైన కేజీబీవీ ప్రత్యేక అధికారి కవితకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని సంబంధిత అధి కారులను ఆదేశించారు.

విద్యార్థినుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశు భ్రంగా ఉంచాలని సూచించారు.

పాఠశాల చుట్టూ సుమారు 100 మీటర్ల పరి ధిలో ఉన్న చెత్త, పొదలు, పిచ్చి మొక్కలను తొలగించి ప్రాంతాన్ని శుభ్రపరచాలని ఆదే శించారు.

అవసరమైన ప్రాంతాల్లో మొరం మట్టి వేసి చదును చేయడంతో పాటు పరిసరా శు భ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించడంలో అధికారులు, సిబ్బంది బాధ్య తగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

అనంతరం అదనపు కలెక్టర్ వాడ్యాల



గ్రామానికి చేరుకుని అక్కడ కొనసాగుతున్న ఫార్మ్‌పాండ్ నిర్మాణ పనులను పరిశీలిం చారు.

పనుల పురోగతి, నిర్మాణ విధానం, నాణ్యత ప్రమాణాలపై ఎంపీడీఓ, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శిని వివరాలు అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వం చేపడుతున్న గ్రామీణాభి వృద్ధి పనులు ప్రజలకు ఉపయోగపడేలా నాణ్యతతో పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.నిర్దేశిత ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం ఉండకూడదని ఆదేశించారు. ఈ పర్యటనలో జీసీడీఓ ఆత్ర ఖాద్రి, ఎంపీడీఓ లక్ష్మణ్ రాథోడ్, సర్పంచ్ శంకర్, కేజీబీవీ ప్రత్యేక అధికారి కవితతో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నడిబొడ్డున అక్రమ కట్టడం - మున్సిపల్ అధికారుల 'చూతూమంత్ర' చర్యలపై పట్టణ ప్రజల విస్మయం




**గద్వాల,సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** గద్వాల పట్టణ మున్సిపాలిటీ పరిధిలో నగర నడిబొడ్డున విలువైన 10% ల్యాండ్‌ను కొందరు అక్రమార్కులు కబ్జా చేసి, ఎలాంటి మున్సిపల్ పర్మిషన్ లేకుండానే భారీ నిర్మాణాన్ని చేపట్టిన వైనం స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది. దీనిపై పట్టణ ప్రజల నుండి, సామాజిక శ్రేణుల నుండి మున్సిపల్ శాఖకు అనేక రకాల ఫిర్యాదులు అందినప్పటికీ, అధికారులు మాత్రం "నిమ్మకు నీరెత్తినట్లు" వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రజా ధనం, ప్రభుత్వ స్థలం కళ్లముందే కబ్జా!**

నగరంలో ఎంతో కీలకమైన, ఖరీదైన ఈ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పిల్లర్లు లేపి, గోడలు కడుతున్నా మున్సిపల్ యంత్రాంగం కన్నెత్తి చూడకపోవడం వెనుక ఉన్న మతలబు ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సామాన్యుడు ఇల్లు కట్టుకుంటే వంద నిబంధనలు చూపే అధికారులు, ఇంత పెద్ద అక్రమ నిర్మాణం యథేచ్ఛగా సాగుతుంటే ఎవరి ప్రాప్తం కోసం, ఎవరి మెప్పు కోసం మౌన ముద్ర దాల్చారు? అక్రమంగా నిర్మిస్తున్న ఆ కట్టడాన్ని పూర్తిగా తొలగించలేక మున్సిపల్ అధికారులు ఎందుకు చితికిలపడ్డారనే విమర్శలు.

**అలా వచ్చి.. ఇలా వెళ్లి: బొట్టు పెట్టినట్లు చూతూమంత్ర చర్యలు!**

వరుస ఫిర్యాదులు, ప్రజల నుండి ఒత్తిడి పెరగడంతో వేరే దారి లేక మున్సిపల్ సిబ్బంది పొక్లెయిన్ వాహనంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే, అక్కడ వారు చేసిన హడావుడి చూసి పట్టణ ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. అక్రమ నిర్మాణాన్ని పునాదులతో సహా కూల్చివేయాల్సింది పోయి, కేవలం కంటితుడుపు చర్యగా... అలా వచ్చి ఇలా వెళ్లి, కట్టడానికి బొట్టు పెట్టినట్లుగా కొద్దిపాటి రాళ్లను కదిలించి చేతులు దులుపుకున్నారు.ఈ "చూతూమంత్ర" కూల్చివేత డ్రామా చూశాక, అధికారుల వెనుక పెద్ద రాజకీయ హస్తం లేదా కబ్జాదారుల అండదండలు ఉన్నాయనే అనుమానాలు మరింత బలపడుతున్నాయి. నామ్‌కే వాస్తే చర్యలు చేపట్టి, కబ్జాదారులకు పరోక్షంగా సహకరిస్తున్న ఈ తీరుపై గద్వాల పట్టణ ప్రజలు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

## గ్రీన్ జడ్చర్ల, క్లీన్ జడ్చర్ల లక్ష్యంగా వన మహోత్సవం



**జడ్చర్ల, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 278లో గల 10 శాతం మున్సిపల్ భూమిలో మంగళవారం వన మహోత్సవం కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమి షనర్ ఎం. గిరీష్ మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందరూ భాగస్వాములై మొక్కలను సంరక్షించాలని కమిషనర్ పిలుపునిచ్చారు. గ్రీన్ జడ్చర్ల - క్లీన్ జడ్చర్ల లక్ష్య సాధనలో భాగంగా మున్సిపాలిట లోని ఖాళీ స్థలాలను గుర్తించి విస్తృతంగా మొక్కలు నాటుతున్నట్లు వెల్లడించారు. మొక్కలు నాటడమే కాకుండా, వాటికి క్రమం తప్ప కుండా నీరు అందిస్తూ సంరక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సంబంధిత అధి కారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి



**జడ్చర్ల, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జడ్చర్ల ఎమ్మార్వో కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీపీఎస్ వల్ల పదవీ విరమణ అనంతరం ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భద్రత కరువైందని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఐక్య పోరాటాలతోనే డిమాండ్లు సాధించుకుంటామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ నాన్-గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు తిరుపతయ్య, పిఆర్ సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణగౌడ్, జాయింట్ యాక్షన్ కమిటీ కో-కన్వీనర్ తాహెర్, వెంకటరాములు, వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రెండు రోజుల్లోగా పారిశుధ్య పనులు పూర్తి చేయాలి

• అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్




**జడ్చర్ల, సెప్టెంబర్ 1(జనంసాక్షి):** మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారి వెంట చేపడుతున్న పారిశుధ్య, సుందరీకరణ పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రహదారి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, గడ్డి తొలగింపు, రహదారి మధ్యలోని మీడియన్‌లో మొక్కల పెంపకం, బారికేడింగ్ పనుల తీరును ఆయన ఆరా తీశారు. అనంతరం సంబంధిత అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష జరిపారు. జాతీయ రహదారి పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, సుందరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బారికేడింగ్, పారిశుధ్యం, మొక్కలు నాటడం తదితర పనులన్నింటినీ మరింత వేగవంతం చేసి, రాబోయే రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ టీచర్

## గైర్హాజరు - గ్రామస్థుల వినూత్న నిర్ణయం



**గద్వాల, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** గద్వాల్ జిల్లా తెలుగోనిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా, స్థానిక అంగన్‌వాడీ టీచర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లి విధులకు హాజరుకావడం లేదని గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేదని వారు ఆరోపించారు. చిన్నారుల భవిష్యత్తు, వారి విద్యాబుద్ధులు దెబ్బతినకూడదనే మానవతా దృక్పథంతో గ్రామస్థులు ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. నిర్లక్ష్యంపై ఆధారపడకుండా, గ్రామస్థులంతా కలిసి తమ సొంత డబ్బులను సమకూర్చుకుని ఓ ప్రైవేట్ టీచర్‌ను నియమించుకున్నారు. తద్వారా పిల్లలకు క్రమం తప్పకుండా పాఠాలు అందేలా ఏర్పాట్లు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద పిల్లలకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్యను అందించాల్సిన అంగన్‌వాడీ కేంద్రం ఇలా పర్యవేక్షణ కరువైపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సంబంధిత మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు తక్షణమే స్పందించి, శాశ్వత ప్రాతిపదికన అంగన్‌వాడీ టీచర్‌ను నియమించి ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ముందు ఏబివిపి ధర్నా



**నారాయణపేట సెప్టెంబర్ 1(జనంసాక్షి):** ప్రభుత్వం విద్యార్థులకు బకాయి పడ్డ 12వేల కోట్ల ఫీజురియంబర్స్మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి క్యాంపు కార్యాలయం ముందు ఏబివిపి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్బంగా ఏబివిపి జిల్లా కన్వీనర్ నరేష్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి అందుబాటులో లేక పోవడం బాధాకరమని అన్నారు. విద్యారంగం సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సమంజ సం కాదని అన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ సదా శివారెడ్డి కి వినతి పత్రం సమర్పించారు...

## సెప్టెంబర్ 3న జిల్లా స్థాయి మౌంటెన్ సైక్లింగ్ పోటీలు



**మక్తల్, సెప్టెంబర్ 01 (జనంసాక్షి):** మక్తల్ సమీపంలోని కొత్త గార్లపల్లి మట్టి రోడ్డులో సెప్టెంబర్ 3న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి 5 కి.మీ. మౌంటెన్ సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. గోపాలం తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని సెప్టెంబర్ 6న శామీర్‌పేట (హైదరాబాద్)లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల వారు ఆధార్, టెన్త్/బోనఫైడ్, 2 ఫొటోలతో పాటు సొంత సైకిల్, హెల్మెట్, షూస్ ధరించి రావాలి. వివరాలకు 7702713139 సంప్రదించవచ్చు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు డాక్టర్ మణికంఠ గౌడ్, తాన్ సింగ్, జి. శివకుమార్, పిఈటి అమ్రేష్ పాల్గొన్నారు.

## పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**మిడ్జిల్, సెప్టెంబర్ 1(జనంసాక్షి):** పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. మండలం పరిధిలో పేద ప్రజలకు మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని బైరంపల్లి. కాంచనపల్లి. దోనూరు. వస్పుల. సింగం దొడ్డి చౌటకుంట తండా మంగలి గడ్డ తండా మసి గుండ్లపల్లి వేముల వాడియాల. గ్రామాలలో అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఎందరో పేద ప్రజలు రేషన్ కార్డులకు దూరమయ్యారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారదర్శకంగా డిజిటల్, స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తోందని చెప్పారు. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు రేషన్ సరుకులు మరింత సులభంగా, ఎలాంటి అవకతవకలు లేకుండా అందుతాయన్నారు. అర్హత ఉండి రేషన్ కార్డులు రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరినీ సర్వే చేసి కార్డులు అందజేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజా పాలనలో భాగంగా ఇచ్చిన ప్రతి మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు వార్డు సభ్యులు మండల గ్రామాల నాయకులు ప్రజలు కార్యకర్తలు పాల్గొన్నారు

## విద్యా, వైద్య సమస్యలు పరిష్కరించాలి

• తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించిన సీపీఎం నాయకులు



**తెలకపల్లి, సెప్టెంబర్ 01 (జనంసాక్షి):** మండలంలోని విద్యా, వైద్య రంగాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ భారతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు నాగపూర్ మధు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు విద్య, వైద్య సేవలు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత నెలలో సీపీఎం జిల్లా కమిటీ బృందం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించగా పలు సమస్యలు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. పీహెచ్‌సీలో ఇద్దరు రెగ్యులర్ వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారని, రోగులకు అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడంతో పాటు పాము కాటుకు గురైన వారికి ఇచ్చే వ్యాక్సిన్ కూడా లేకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. నైట్ వాచ్‌మన్ పోస్టు ఖాళీగా ఉండగా, స్వీపర్‌గా పనిచేస్తున్న సిబ్బందితో నైట్ వాచ్‌మన్ విధులు నిర్వహిస్తున్న పరిస్థితి ఉందని వివరించారు. అదేవిధంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయడం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో సరిపడా వైద్య సిబ్బంది, మందులు, అత్యవసర వైద్య సదుపాయాలు కల్పిస్తే గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. విద్య, వైద్యం ప్రజల ప్రాథమిక అవసరాలని, ఈ రంగాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని నాగపూర్ మధు పేర్కొన్నారు.

## మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు : ఎస్ఐ వెంకటేశ్వర్లు



**నారాయణపేట సెప్టెంబర్ 1(జనంసాక్షి):** రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ సురక్షితంగాప్రయాణించాలని నారాయణపేట టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం నారాయణపేట పట్టణంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వినియోగం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. మైనర్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవిం చే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్, అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, డ్రైవింగ్ సమ యంలో సెల్‌ఫోన్ వినియో గం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామనితెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఎస్ఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భద్రతను దృష్టిలో ఉంచు కుని మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ఆయన కోరారు.

## వెంకటంపల్లికి ఆన్‌లైన్ ఇసుకను తక్షణమే సరఫరా చేయాలి

• సర్పంచ్ రామాంజనేయులు



**ఖిల్లా ఘనపురం, 01, సెప్టెంబర్, (జనంసాక్షి):** మండల పరిధిలోని వెంకటంపల్లి గ్రామం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న ఇసుక గత నాలుగు నెలలుగా రావడం లేదని నిరసిస్తూ మంగళవారం స్థానిక సర్పంచ్ రామాంజనేయులు ఆధ్వర్యంలో గ్రామస్తులు వెంకటంపల్లి, ఘనపురం ప్రధాన రహదారిపై ఇసుక ట్రాక్టర్లను నిలిపి వేసి ధర్నా చేపట్టారు.

**సర్పంచ్ మాట్లాడుతూ..** గ్రామస్తులు ఇళ్ల నిర్మాణాలు, ఇతర అవసరాల కోసం ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్నప్పటికీ సరైన సమయానికి ఇసుక అందడం లేదని, కొందరి బుకింగ్స్ దానంతట అవే క్యాన్సిల్ అవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక కొరత వల్ల ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు కట్టుకుంటున్న లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని ఇసుక రీచ్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఇసుక పక్కదారి పడుతోందని, కొందరు ట్రాక్టర్ యజమానులు అదే అనువుగా ఇసుకను




దాదాపు రూ.3,500 వరకు అధిక ధరకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి, ఆన్‌లైన్ బుకింగ్ లిస్టు ప్రకారం వెంకటంపల్లి నివాసులకు వెంటనే ఇసుకను అందజేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న నాయబ్ తహశీల్దార్ లక్ష్మీకాంత్ అక్కడకు చేరుకుని మాట్లాడారు. ఇసుక రీచ్‌లో చిన్న చిన్న పొరపాట్లు జరగడం వల్లే సరఫరా ఆలస్యమైందని తెలిపారు. రాబోయే 2-3 రోజుల్లోనే ఆన్‌లైన్ లిస్టు ప్రకారం వెంకటంపల్లి గ్రామానికి ఇసుకను పూర్తిస్థాయిలో అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఆన్‌లైన్ నిర్దేశిత ధర కంటే అధిక ధరకు ఇసుకను విక్రయిస్తే సదరు ట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఎర్రవల్లిలో అండర్ పాస్ నిర్మాణం చేయాలనీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకీ వినతి

**ఎర్రవల్లి, జులై4 (జనంసాక్షి):** ఎర్రవల్లి మండల కేంద్రంలో (పాతఊరు ) జాతీయరహదారికీ ఇరువైపుల నివాస గృహాలు ఉన్నందున ఒకే వైపు గుడి, బడి, స్మశానం, మరియు తహసీల్దార్ ఆఫీస్ ఉన్నందున అవల వైపు ఉన్న ప్రజలు, పిల్లలు, మహిళలు దాటాడానికి చాలా ఇబ్బందులు ఉన్నాయని గ్రామ సర్పంచ్ అనితకృష్ణసాగర్, ఉప సర్పంచ్ మద్దిలేటిగౌడ్ ఎమ్మెల్సీచల్లా వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు కీ వినతి పత్రం ఇవ్వడం జరిగింది.. ఎమ్మెల్సీ ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఎర్రవల్లిలో అండర్ పాస్ నిర్మాణం చేయాలనీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకీ వినతి.

## మత్తు మాఫియాపై పోలీసుల ఉక్కుపాదం

- మూడేళ్లుగా గంజాయి దందా.. యువతే లక్ష్యంగా విక్రయాలు
- గంజాయి విక్రేత సత్తి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు: ఎస్ఐ కురుమూర్తి



**కల్వకుర్తి,సెప్టెంబర్ 1,(జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న రంగాపూర్ గ్రామానికి చెందిన ఆలే సత్యనారాయణ అలియాస్ సత్తిని పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. గత మూడేళ్లుగా సత్యనారాయణ గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా ప్రాంతానికి చెందిన లకన్ అలియాస్ లాలా,సునీత అనే వ్యక్తుల నుంచి కిలోల లెక్కన గంజాయిని కొనుగోలు చేసి,చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారు చేసేవాడని పేర్కొన్నారు.అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో యువతకు ఒక్కో ప్యాకెట్‌ను రూ.300 నుంచి రూ.400 వరకు విక్రయిస్తూ డబ్బులు సంపాదిస్తున్నట్లు తెలిపారు.గంజాయి కొనుగోలు చేసినా,సేవించినా, విక్రయించినా కేసులు నమోదు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కురుమూర్తి హెచ్చరించారు.యువత గంజాయికి దూరంగా ఉండాలని సూచించారు.గంజాయి విక్రయాలు,వినియోగానికి సంబంధించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు ప్రతిభావంతులైన విద్యార్థుల ఎంపిక

- మండల స్థాయి పోటీల్లో 180 మంది విద్యార్థుల ఉత్సాహాభరిత పాల్గొనడం



**ఉప్పునుంతల, (జనంసాక్షి):** ఉప్పునుంతల మండల కేంద్రంలోని పియంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (SGF) క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక ప్రక్రియ ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గ్రామ సర్పంచ్ చింతగాళ్ల శ్రీనివాసులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ట అనంతరెడ్డి హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు.

మండల పరిధిలోని కేజీబీవీ, కంసానిపల్లి, వెల్టూరు, మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలకు చెందిన సుమారు 180 మంది విద్యార్థినీ విద్యార్థులు ఎంపిక పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఖో-ఖో, వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన ఉత్తమ క్రీడాకారులను మండల స్థాయి జట్లకు ఎంపిక చేసినట్లు మండల విద్యాధికారి జటప్రోలు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల స్థాయికి ఎంపికైన క్రీడాకారులు రానున్న జిల్లా స్థాయి పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షిస్తూ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నీల శ్రీధర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణ్, రమేష్, సంధ్య, హరీష్‌తో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు పైతర గ్రామంలో ప్రత్యేక చర్యలు

- ప్రధాన వీధులు, కాలనీల్లో మందు పిచికారీ
- గ్రామ సర్పంచ్ యాబన్న గారి రవితేజ రెడ్డి ఆధ్వర్యంలో



**కొల్చారం, సెప్టెంబర్ 01 (జనంసాక్షి):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొల్చారం మండలంలోని పైతర గ్రామంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ యాబన్న గారి రవితేజ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేశారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధాకర్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మేఘారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలి



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** ఎమ్మెల్యే మేఘారెడ్డి దళితుల అసైన్డ్ భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, ఆయనపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, పార్టీ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి, నాయకులు ఎం. రాజశేఖర్, దొడ్ల రాములు, జాత్య నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. వెలుటూరు శివారులో జాతీయ రహదారి సమీపంలోని సర్వే నంబర్ 517/A2లో 0.39 గుంటల లావణి పట్టా భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుని, రెవెన్యూ రికార్డుల్లో పట్టా మార్పిడి చేయించుకున్నారని ఆరోపించారు. నిషేధిత అసైన్డ్ భూముల క్రయవిక్రయాలపై నిబంధనలు ఉన్నప్పటికీ అధికారాన్ని ఉపయోగించారని ఆరోపించారు.

అలాగే దోడగుంటపల్లి-అంకూరు మధ్య సోలార్ ప్లాంట్ కోసం సర్వే నంబర్లు 548/A2, 548/E4, 548/E5, 548/E3, 548/E2, 548/E1 పరిధిలోని సుమారు 5 ఎకరాల 10 గుంటల లావణి పట్టా భూమి రిజిస్ట్రేషన్‌లో ఎమ్మెల్యే పాత్ర ఉందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర సర్వే నిర్వహించాలని కోరారు. ఎన్నికల అఫిడవిట్‌లో లావణి పట్టా భూమిని 'పట్టా భూమి'గా పేర్కొని తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే భూముల వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఆరోపణలపై స్పందించి వాస్తవాలు వెల్లడించాలని కోరారు. సమావేశంలో పలువురు నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై పీఆర్‌టీయూ సమరభేరి



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో మంగళవారం మహా ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 30 వేల మందికి పైగా ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మునిపల్లి మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి సురేందర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నా సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలు, పీఆర్సీ ప్రకటన వంటి ప్రధాన హామీలు ఇంకా అమలు కాలేదని విమర్శించారు.

**ప్రధాన డిమాండ్లు:**

1. సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలి.
2. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలి.
3. పీఆర్సీని తక్షణమే ప్రకటించాలి.
4. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని రకాల బకాయిలను చెల్లించాలి.
5. పదవీ విరమణ అనంతరం రావాల్సిన ప్రయోజనాలను సకాలంలో అందించాలి.

ఏళ్ల తరబడి బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి హామీలను అమలు చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మునిపల్లి మండలం నుంచి సుమారు 30 మంది ఉపాధ్యాయులు మహా ధర్నాలో పాల్గొన్నట్లు చంద్రమౌళి, సురేందర్ తెలిపారు. సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో అభ్యంతరాలపై అప్పీల్ అవకాశం

- 9(2) యాక్ట్ ద్వారా సమస్యల పరిష్కారం: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ టౌన్ సెప్టెంబర్ 01 (జనంసాక్షి):** మెదక్ జిల్లాలో భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలు, రికార్డులకు సంబంధించి అభ్యంతరాలు ఉన్న రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అప్పీల్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. మంగళవారం మెదక్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో భూ రీసర్వే పూర్తయిన ఆరు గ్రామాల్లోని భూ సమస్యలు, అభ్యంతరాలపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. భూ రీసర్వేకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు లేదా సమస్యలు ఉంటే 9(2) యాక్ట్ ద్వారా అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో డీటీ స్థాయి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు అందుబాటులో ఉండి, ప్రజల నుంచి వచ్చే అప్పీళ్లను పరిశీలించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రీసర్వేకు సంబంధించిన అప్పీళ్ల స్వీకరణ కోసం తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్పీళ్లను స్వీకరించి, సమస్యలను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

ఈ సమావేశంలో ఆర్డీవో రమాదేవి, ఏ.డీ. ల్యాండ్ సర్వే కిషన్, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దొంగ అరెస్ట్



**తూప్రాన్ సెప్టెంబర్ 1(జనంసాక్షి):** దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తుని అరెస్ట్ చేసినట్లు తుఫాన్ సిఐ వెంకట్ రాజు గౌడ్ తెలిపారు. ఆయన విలేకరుల సమావేశంలో వివరించారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి కి చెందిన మామిడి శ్రీకాంత్ పలు దొంగతనాలకు పాల్పడి ఖమ్మం జైలు నుండి విడుదలయ్యాడు గత నెల 29 రాత్రి ఇంటి తాళాలు పగలగొట్టి రెండు గ్యాస్ సిలిండర్లు దొంగతనం చేశారు అనంతరం మరో ఇంటి వద్ద యాక్టివా స్కూటీని దొంగతనం చేశారు. సూర్యాపేట హైటెక్ కాలనీలో ద్విచక్ర వాహనం దొంగతనం దొంగతనం చేసినట్లు నేరమంగీకరించాడని చెప్పారు ఈరోజు గ్యాస్ సిలిండర్‌లను యాక్టివా స్కూటీపై తరలిస్తుండగా కరీం కూడా బ్రిడ్జి వద్ద అనుమానంతో పోలీసులు పట్టుకున్న రని తెలిపారు. నిందితుడు గతంలో 15 దొంగతనాలు వరకు చేశాడని తెలిపారు .అతని వద్ద నుండి ,మరో బైక్ను రెండు సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు . నేరస్తుని రిమాండ్ పంపించినట్లు చెప్పారు .నేరస్తుని పట్టుకోవడంలో కానిస్టేబుళ్లు మహేష్ కృష్ణ గోవర్ధన్ సురేష్ రాజుల ను అభినందించారు. సీసీ కెమెరాలు ఆధారంగా ఇతర సాంకేతిక ఆధారాలు సహాయంతో నిరసన పట్టుకున్నట్లు తెలిపారు

## తల్లిదండ్రుల ఆశయాలకనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే

• **జిల్లా కలెక్టర్ కే. హైమావతి**



**సిద్దిపేట బ్యూరో (జనంసాక్షి):** మంగళవారం జిల్లా కేంద్రంలోని టీటీడీసీ భవన్‌లో మండల విద్యాశాఖ అధికారులు మరియు ప్రధానోపాధ్యాయులతో జిల్లా కలెక్టర్ విద్యాశాఖ రివ్యూ నిర్వహించారు తల్లి దండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ఎన్రోల్మెంట్ ను తెలుసుకొని నిర్దేశిత లక్ష్యం మేరకు ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులను చేర్చుకోవడంలో విద్యాశాఖ వెనుకబడి ఉందని అన్నారు. 89462 మంది విద్యార్థులను చేర్చుకోవాలని లక్ష్యం పెట్టుకోగా 82489 నందిని చేర్చుకోవడం జరిగిందని 7.79 % చేయాల్సి ఉందని అన్నారు. ఉపాధ్యాయులపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగితే తప్పకుండా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తారని, విద్యార్థుల ఎదుగుదలని లక్ష్యంగా తల్లిదండ్రుల ఆశయాల మేరకు విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు శాతం అధికంగా ఉండాలని అన్నారు. విద్యార్థుల ఆధార్ నమోదు శనివారంలోగా పూర్తి చేయాలని అన్నారు. విద్యతోపాటు మోరల్ వాల్యూస్ పిల్లలకు నేర్పాలని, తమ వద్ద చదువుకున్న పిల్లలు ఏ స్థాయిలో ఉన్నా కూడా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఎప్పటికీ మర్చిపోరని అది ఉపాధ్యాయులకు ఎంతో గౌరవం అని తెలిపారు. వివిధ సంక్షేమ హాస్టల్ లో చదువుకునే విద్యార్థులు ఒకరోజు రెండు రోజులు హాలిడేస్ వస్తే ఇండ్లకు వెళ్లి త్వరగా రావడంలేదని ఉపాధ్యాయులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, సెక్టోరల్ అధికారి రామస్వామి, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎస్ వద్దు.. ఓ పి ఎస్ ముద్దు!

• **పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి**
• **తూప్రాన్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయుల నిరసన**



**తూప్రాన్, సెప్టెంబరు 1 (జనంసాక్షి):** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (CPS)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (OPS)ను వెంటనే పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రతపై స్పష్టత లేకపోవడంత సిపిఎస్ విధానంపై ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంటోందని పేర్కొన్నారు. ఎస్ జి టి యు మండల శాఖ అధ్యక్షుడు గాంధీ, యాదగిరి ఆధ్వర్యంలో టీజేఇజాక్ తరపున ఉద్యోగ, ఉపాధ్యాయులు తూప్రాన్ ఆర్డిఓ కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. సిపిఎస్ ను రద్దు చేసి ఓ పి ఎస్ ను పునరుద్ధరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్‌ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నాయకులు కోరారు. స్పందించిన ఆర్డిఓ ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో శాలిఖ, ఎంఈఓ డా. పార్వతి సత్యనారాయణ ఎస్ జి టి యు ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం, జిల్లా అధ్యక్షుడు జింక అశోక్తో పాటు మండలంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మినీ స్టేడియం స్థలాన్ని కాపాడండి

### ఎమ్మెల్యే మేఘారెడ్డికి 'క్రాంతి క్రీడా అసోసియేషన్' మండల అధ్యక్షులు యాదయ్య విజ్ఞప్తి



**ఖిల్లా ఘనపురం, సెప్టెంబర్ 01 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని అన్నహాడ్ శివారు సర్వే నంబర్ 39లో క్రీడా మైదానం కోసం కేటాయించిన 7 ఎకరాల స్థలాన్ని యథాతథంగా కాపాడి, దానిని మినీ స్టేడియంగా అభివృద్ధి చేయాలని క్రాంతి క్రీడా అసోసియేషన్ మండల అధ్యక్షుడు యాదయ్య స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డిని కోరారు.క్రీడా మైదానం కోసం గతంలో గ్రామసభ తీర్మానం ద్వారా సర్వే నంబర్ 39లోని 7 ఎకరాల స్థలాన్ని క్రీడా మైదానానికే కేటాయించారు. అయితే, అందులో నుండి ఒక ఎకరా స్థలాన్ని గిరిజన సంక్షేమ (ట్రైబల్ వెల్ఫేర్) ఆశ్రమ పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి స్థానిక కొందరు నాయకులు మళ్లించే ప్రయత్నం చేయడం సరికాదని, ఇది మైదానాన్ని ముక్కలు చేసి ఆక్రమణలకు దారితీస్తుందని యాదయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల పక్కనే వేరే ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందని, గతంలో తహసీల్దార్ సలీమ్ హయాంలో ఆ స్థలానికి బోర్డు కూడా ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఆ స్థలాన్ని వదిలేసి క్రీడా మైదానా స్థలాన్ని తీసుకోవడం ముమ్మాటికీ అన్యాయమని స్పష్టం చేశారు.ఈ మైదానంలో సాధన చేసిన ఎంతోమంది యువకులు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, పోలీస్ , ఎస్సై ఉద్యోగాలకు ఎంపికయ్యారు అని గుర్తు చేశారు రాబోవు కామన్వెల్త్ 2030, ఒలింపిక్స్ 2036 వంటి అంతర్జాతీయ క్రీడలకు సన్నద్ధమయ్యేందుకు, రన్నింగ్, లాంగ్ జంప్, హై జంప్ వివిధ రకాల క్రీడలను శిక్షణ తీసుకోవడానికి ఈ మైదానం ఎంతో దోహదపడుతుంది అని అన్నారు,

ఈ మైదానంలో శిక్షణ పొందిన 'సేపాక్ తక్రా' అంతర్జాతీయ క్రీడాకారిణి నవత, భారతదేశం తరపున 2013 మలేషియా సూపర్ సిరీస్, 2014 సౌత్ కొరియా, 2017 హైదరాబాద్ వరల్డ్ కప్‌లతో పాటు 2018–2022 మధ్య బ్యాంకాక్‌లో జరిగిన పలు అంతర్జాతీయ పోటీలలో పాల్గొని దేశానికి ఎన్నో పతకాలు అందించారని గుర్తుచేశారు. స్థలాన్ని వేరే అవసరాలకు మళ్లిస్తే యువత, క్రీడాకారులను సమీకరించి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని యాదయ్య హెచ్చరించారు.

**అంతర్జాతీయ క్రీడాకారిణి నవత...**



భావి తరాల క్రీడాకారుల ప్రయోజనాల దృష్ట్యా ఈ క్రీడా మైదానాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సేపాక్ తక్రా అంతర్జాతీయ క్రీడాకారిణి నవత పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి ఈ మైదానం ఎంతో కీలకమని, స్థల పరిరక్షణ కోసం మండలంలోని యువత, క్రీడాకారులంతా ఐక్యంగా ముందుకు రావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి




**సిద్దిపేట,(జనంసాక్షి):** గ్రామీణ నిరుద్యోగ యువత, మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని డీఆర్‌డీఏ పీడీ రమేష్ సూచించారు. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని చిన్నతరహా వ్యాపారాలు ప్రారంభించడం ద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. ప్రభుత్వం, బ్యాంకులు, శిక్షణ సంస్థలు అందిస్తున్న పథకాలు, రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా వ్యాపార నిర్వహణ, మార్కెటింగ్, బ్యాంకింగ్, ఆర్థిక నిర్వహణపై శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో మగ్గం వర్క్స్, పాడి పశువుల పెంపకం, పుట్టగొడుగుల తయారీపై శిక్షణలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఏ సుధీర్, సంస్థ డైరెక్టర్ గేము నాయక్, సిబ్బంది, శిక్షణార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా బస్సులు నడిపించాలి



**తూప్రాన్, సెప్టెంబర్ 1(జనంసాక్షి):** తూప్రాన్ మండల పరిసర గ్రామాల ఇంజనీరింగ్ ఇంటర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిత్యం హైదరాబాద్ వెళ్లాలంటే పై చదువుల నిమిత్తం కొంపల్లి, సికింద్రాబాద్ వెళ్లే విద్యార్థుల ఇబ్బందులు తీర్చేందుకు ఉదయం ప్రత్యేక బస్సులు నడపాలని మేడ్చల్ డిపో మేనేజర్ ప్రమీల,, సిఐ రామారావ్ కు బలగం మిత్ర బృందం స్వచ్ఛంద సేవ సంస్థ వారు వినతి పత్రాన్ని అందించారు. డిపో మేనేజర్ పరమీల సానుకూలంగా స్పందించి ఉదయం ఏడు గంటలకు మరియు ఎనిమిది గంటలకు రెండు బస్సులు వారం రోజుల్లో నడిపిస్తామని హామీ ఇచ్చారు సాయంత్రం సికింద్రాబాద్ నుంచి వచ్చే విద్యార్థులకు రెండు బస్సులు రూట్ నెంబర్ 589 బస్సులు నడిపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మామిడి వెంకటేష్ మాజీ ఎంపీటీసీ వెంకటేష్ యాదవ్, వేణుగోపాల్, రాజు చారి ,పంబాల కృష్ణ శ్రీనివాస్ చారి, సుభాష్ రెడ్డి, తాటి లచ్చులు, దుర్గం రమేష్, కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

## జిల్లా నలుమూలల నుండి మహాధర్నాకు తరలిన పిఆర్‌టియు ఉపాధ్యాయులు



**నారాయణపేట సెప్టెంబర్ 1(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైద రాబాదులోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహా ధర్నాకు నారాయణపేట జిల్లా నలుమూలల నుండి పి ఆర్ టి యు ఆధ్వర్యంలో దాదాపు 600కు పైబడి ఉపాధ్యా యులు తరలి వెళ్లారు నారాయణపేట జిల్లా కేంద్రంలో జిల్లా అధ్య క్షులు వై జనార్ధన్ రెడ్డి జెండా ఊపి వాహనాలను రాష్ట్ర రాజధానికి తరలిం చారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వై జనార్ధన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి వెంకట రెడ్డి జిల్లాలోని మండలాల బాధ్యులు ఆయా మండలాలలో కార్యక్రమాన్ని ప్రారం భిస్తూ ప్రభుత్వము ఇచ్చిన హామీలైన పి ఆర్. సి,అమలు,సిపిఎస్ రద్దు 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్,317 జీవోకు పరిష్కారముచూపాలనీ, 2008 డీఎస్సీ కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయడం,హెల్త్ కార్డులను సక్రమంగా అమలు చేయడము వెంటనే చేయాలని లేని పక్షంలో ఉద్యమం తీవ్ర రూపం దాలుస్తుందని హెచ్చరించారు.నారాయణపేట జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి 2034 వరకు వారు ముఖ్యమంత్రిగా ఉంటాను అని పదేపదే అంటున్నారు వారు ముఖ్యమంత్రిగా ఉండాలి అంటే 51 శాతం ఫిట్మెంట్తో పి ఆర్ సి నీ ప్రకటించాలని,సి పి ఎస్ రద్దు మిగిలిన అన్ని సమ స్యలను ప్రత్యేకించి వెంటనే చేస్తే రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికలలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉద్యో గ ఉపాధ్యాయులు ముఖ్య మంత్రి వెంబడి నిలబడి బాసటగా ఉంటారని అన్నా రు. ప్రభుత్వము బేషజాల కు పోకుండా పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ హైద రాబాదు వైపుకు భారీ సంఖ్యలో బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు పి.నర్సిం హా రెడ్డి జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.రఘువీర్, ఎం.జనార్ధన్, సత్యనారాయణ రెడ్డి, రమేష్, గోవర్ధన్, నరసింహారెడ్డి, భాస్కర్, సూర్యప్రకాష్, శేఖర్, అజయ్, బలరాం, తిమ్మన్న, గోపాల్ రెడ్డి,బాబు, వెంకటేష్, హరీష్, కిష్టయ్య, లక్ష్మణ్, నవీన్ కుమార్, ముస్తఫా, ప్రకాష్ గౌడ్,అనంతయ్య, వెంకటేష్,బీమేష్,రాజేంద్ర బాబు శ్రీకాంత్,వాణిశ్రీ,, జహీరుద్దీన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లా కార్యవర్గ సభ్యులు మహిళలు సంధ్య హిందు రాణి సభా సుల్తానా మాధవి శశిరేఖ శ్వేతా, అనిత, హేమలత, తిరుమల, కవిత కళ్యాణి అధిక మొత్తంలో ఉపాధ్యా యులు పాల్గొన్నారు

## పాలమాకులలో జై గౌడ్ ఉద్యమ గ్రామ కమిటీ ఏర్పాటు



**నంగునూరు,సెప్టెంబర్ 01 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో గౌడ సంఘం సభ్యుల సమక్షంలో జై గౌడ్ ఉద్యమం ఆధ్వర్యంలో విలేజ్ కమిటీని ఏర్పాటు చేశారు. జై గౌడ్ ఉద్యమం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గంధపు హరి గౌడ్, ముస్మిర్ పరుశురాం గౌడ్ సమక్షంలో నూతన కమిటీని ప్రకటించారు.

నూతన కమిటీగా జై గౌడ్ ఉద్యమం పాలమాకుల గ్రామ అధ్యక్షుడిగా దుంబాల ప్రభాకర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా రంగు రమేష్ గౌడ్, యూత్ అధ్యక్షుడిగా యాదండ్ల శివ గౌడ్, యూత్ ఉపాధ్యక్షుడిగా యాదండ్ల చిన్న బాల నర్సింలు గౌడ్లను నియమించారు.గౌడ సమాజ హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.పాలమాకుల గ్రామంలో కమిటీ ఏర్పాటుకు సహకరించిన గౌడ సంఘం సభ్యులందరికీ జై గౌడ్ ఉద్యమం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## జాతీయ రహదారిపై అండర్ పాస్ పనుల్లో జాప్యం - అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**బాలానగర్, సెప్టెంబర్ 02 (జనంసాక్షి):** బాలానగర్ మండల కేంద్రంలోని హైదరాబాద్–బెంగళూరు 44వ జాతీయ రహదారిపై చేపట్టిన అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులను అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

గత రెండేళ్లుగా పనులు నత్తనడకన సాగుతుండటంతో జాతీయ రహదారిపై నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గమనించిన అడిషనల్ కలెక్టర్, పనుల పురోగతిపై కాంట్రాక్టర్ సునీల్ జాదవ్ ను వివరణ కోరారు. పనుల్లో జాప్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

వాహనదారులకు ఇబ్బంది లేకుండా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. బ్రిడ్జికి ఇరువైపులా తాత్కాలిక బీటీ రోడ్డును వెంటనే పూర్తి చేసి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించాలని సూచించారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ అనిల్ కుమార్ రెడ్డి, స్థానిక సర్పంచ్ గుమ్మళ్ల వెంకటేశ్వర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జగన్, సంబంధిత శాఖ అధికారులు ఉన్నారు.

### కాంగ్రెస్ 1000 రోజుల

## విఫల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

- **6 గ్యారంటీలు, 420 హామీల అమలుకు 8 రోజుల ఆందోళనలు: సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు, 11 డిక్లరేషన్లను అమలు చేయడంలో విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. హామీల అమలుకు డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎనిమిది రోజుల పాటు వినూత్న నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆందోళన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందాయని, మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలును విస్మరించిందని విమర్శించారు.

రైతు భరోసా, రుణమాఫీ, పంటలకు బోనస్, రైతు కూలీలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా, ఆటో కార్మికులు, మహిళలకు ఆర్థిక సాయం, వృద్ధులు, బీడీ కార్మికులు, దివ్యాంగులకు పింఛన్లు, కళ్యాణలక్ష్మి--షాదీముబారక్ కింద తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు రావాల్సిన ప్రయోజనాలు అందే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం 'ఎస్ఐఆర్' ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సమీక్షించారు. బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ నాయకులు ఓటర్లకు వచ్చిన నోటీసుల విషయంలో అప్రమత్తంగా ఉండి, సమస్యల పరిష్కారానికి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో జిల్లా, మండల స్థాయి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్కారు బాయ్' మూవీలో తాగుబోతు పాత్రలో గడ్డం మైపాల్



**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామానికి చెందిన గడ్డం మైపాల్ సినీ రంగంలో తనకంటూ గుర్తింపు తెచ్చుకుంటున్నారు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన ఆయన చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తితో పదో తరగతి అనంతరం హైదరాబాద్‌కు వెళ్లారు. చిన్నచిన్న పాత్రలతో సినీ ప్రయాణాన్ని ప్రారంభించిన మైపాల్ పలు సినిమాల్లో నటించారు. ప్రస్తుతం 'సర్కారు బాయ్' చిత్రంలో తాగుబోతు పాత్రలో నటిస్తున్నారు. 1985 నాటి గ్రామీణ జీవనం, అంటరానితనం, నీటి సమస్యలను ఇతివృత్తంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి లారా దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రంలో శ్రీరామ్ నిమ్మల, వర్షిక, బాహుబలి ప్రభాకర్, నాగమహేష్, చలాకీ చంటి తదితరులు నటిస్తున్నారు.

## సమస్యల పరిష్కారమే లక్ష్యం.. అభివృద్ధికి పెద్దపీట

- **అధికారులకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదేశం**



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 01 (జనంసాక్షి):** గ్రామాల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని వివిధ అంశాలపై సమీక్షించారు. మండలంలోని గ్రామాల్లో నెలకొన్న రైతుల సమస్యలు, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, పారిశుద్ధ్యం తదితర సమస్యలను సర్పంచులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే చర్చించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాల్లో అభివృద్ధి మరింత వేగవంతమవుతుందన్నారు. గ్రామాల అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. రైతులు, విద్యార్థులు, పేదలు, సామాన్య ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చూడాలని అన్నారు. సమావేశంలో ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్, వివిధ శాఖల అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి.. సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే కసిరెడ్డి



**కల్వకుర్తి, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. మంగళవారం నియోజకవర్గంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.

**ఎల్లికల్ వంతెన ప్రారంభం:**

ఎల్లికల్‌లో నిర్మించిన వంతెనను ఎమ్మెల్యే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. వంతెనతో స్థానికుల రాకపోకలకు మరింత సౌకర్యం కలగనుందని తెలిపారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు.

**వీధి వ్యాపారులకు పత్రాల పంపిణీ:**

కల్వకుర్తి ఎమ్మెల్యే శిబిర కార్యాలయంలో బస్‌స్టాండ్ పరిసర ప్రాంతాల వీధి వ్యాపారులకు సంబంధించిన పత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని సూచించారు.

**సంక్షేమ పథకాల అమలు:**

లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**విద్యుద్దీపాల ప్రారంభం:**

సాయంత్రం కల్వకుర్తి పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎత్తయిన విద్యుద్దీపాలను ప్రారంభించారు. రాత్రివేళ మెరుగైన వెలుతురు, ప్రజలకు భద్రత, రాకపోకలకు సౌకర్యం కల్పించడమే లక్ష్యమన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని చెప్పారు. అభివృద్ధి పనులతో పాటు పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచే సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఇసుక పేరుతో అక్రమ వసూళ్లు ఆపాలి

- **పెద్దాపూర్ సర్పంచ్ వంగ సాయిబాబు గౌడ్**





**ఉప్పునుంతల, (జనంసాక్షి):** ఉప్పునుంతల మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో మైనింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ చేసుకుని లబ్ధిదారులకు ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తున్న నేపథ్యంలో కొందరు అక్రమంగా అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారని పెద్దాపూర్ గ్రామ సర్పంచ్ వంగ సాయిబాబు గౌడ్ ఆరోపించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ద్వారా నిర్ణీత రుసుము చెల్లించి ఇసుక పొందుతున్నప్పటికీ, కొందరు ట్రాక్టర్ యజమానుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. పెద్దాపూర్ గ్రామ పరిధిలోని వారికి ఒక ట్రాక్టర్‌కు రూ.5,000, పక్క గ్రామాల వారికి రూ.10,000 చొప్పున డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

గ్రామ సభలో ఎలాంటి తీర్మానం చేయకుండా, గ్రామంలో ఎలాంటి చాటింపు నిర్వహించకుండా, అలాగే ఏదైనా ఆలయ నిర్మాణ కమిటీ పేరుతో అధికారికంగా కమిటీ ఏర్పాటు చేయకుండా డబ్బులు వసూలు చేయడం సరికాదని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ విధంగా వసూలు చేస్తున్న డబ్బులకు గ్రామపంచాయతీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక పొందుతున్న సమయంలో అదనంగా డబ్బులు వసూలు చేయడం వల్ల గ్రామానికి చెడ్డపేరు వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వసూళ్లకు పాల్పడుతున్న వారిపై సంబంధిత ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు జరుగుతున్నట్లయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అలాగే ట్రాక్టర్ యజమానుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేసే ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని సర్పంచ్ డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ పేరుతో గానీ, ఇతర కమిటీల పేరుతో గానీ అనధికారికంగా ఎలాంటి వసూళ్లు చేయవద్దని సూచించారు.

ఈ విషయంపై సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.